తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
వరంగల్ | సోమవారం-12- జనవరి 2026 | సంపుటి : 3 | సంచిక : 225 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in



# నిజామాబాద్‌లో సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

- అర్హులైన లబ్ధిదారులకు చెక్కులు అందజేత
- ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం
- వైద్య ఖర్చులతో బాధపడేవారికి ఊరట

**నిజామాబాద్, జనవరి 11 (తెలంగాణ ముచ్చట్లు):**

నిజామాబాద్ పట్టణంలో సీఎం సహాయ నిధి చెక్కులను అర్హులైన లబ్ధిదారులకు టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ స్వయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందని తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న పేద కుటుంబాలకు సీఎం సహాయ నిధి బలమైన అండగా నిలుస్తోందని చెప్పారు. అవసరంలో ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సహాయం అందేలా కృషి కొనసాగుతోందని స్పష్టం చేశారు.

మిగతా 2లో

### సంక్రాంతి సెలవులతో మేడారంలో ముందస్తు

# భక్తుల సందడి

- మేడారానికి ముందస్తు తరలి వెళ్తున్న భక్తులు
- జంపన్న వాగు, గద్దెల వద్ద కిటకిటలాడుతున్న జనసంద్రం
- మొక్కులు–పుణ్యస్నానాలు: వనదేవతలకు భక్తుల నైవేద్యాలు
- ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ఏర్పాట్లు
- భక్తులకు సౌకర్యాలు, భద్రతపై అధికారుల చర్యలు



**హైదరాబాద్, జనవరి 11 (తెలంగాణ ముచ్చట్లు)**

సమ్మక్కసారలమ్మ ఆసియాలోనే అతి పెద్ద గిరిజన జాతర. సంక్రాంతి పండుగ సెలవులు ప్రారంభం కావడంతో మేడారం సమ్మక్కసారలమ్మ మహా జాతర కు భక్తులు ముందుగానే తరలివెళ్తున్నారు. దీంతో మేడారంలోని గద్దెల ప్రాంగణం తోపాటు జంపన్న వాగు పరిసరాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. వాస్తవానికి జనవరి 28 నుంచి 31 వరకూ మహాజాతర కొనసాగనుంది. కానీ, అప్పటికి విపరీతమైన రద్దీని దృష్టిలో ఉంచుకొని వనదేవతలకు ముందస్తు మొక్కులు చెల్లించుకుంటున్నారు భక్తులు.
భక్తులు జంపన్న వాగులో పుణ్యస్నానం ఆచరించిన తర్వాత సమ్మక్కసారలమ్మ, గోవిందరాజు,

మిగతా 2లో



### మునిసిపల్ ఎన్నికల్లో నాలుగోసారి బీఆర్ఎస్ ఓటమి ఖాయం

**హైదరాబాద్, జనవరి 11 (తెలంగాణ ముచ్చట్లు)**

అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో జరిగిన 3 ఎన్నికల్లోనూ బీఆర్ఎస్‌ను చీకొట్టిన రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించారని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. త్వరలో జరిగే పురపాలక, మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో నాలుగోసారి బీఆర్ఎస్‌ను ఓడిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఇంటి ఆడబడుచుకు న్యాయం చేయలేని వారు తెలంగాణ ఆడబడుచులను ఉద్ధరిస్తామని చెప్పుకోవడం సిగ్గు చేటన్నారు.

2లో

# సంక్రాంతి పండుగతో ఖాళీ అవుతున్న హైదరాబాద్

- సంక్రాంతి ఎఫెక్ట్: భాగ్యనగరం నుంచి స్వగ్రామాల బాట
- బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో కిక్కిరిసిన ప్రయాణికుల రద్దీ
- బస్సులు–రైళ్ల రిజర్వేషన్లు ఫుల్: మహిళలు, వృద్ధులకు అవస్థలు
- ప్రైవేట్ ట్రావెల్స్ దోపిడీ: రెట్టింపు నుంచి మూడింతల చార్జీలు
- నగర ఎగ్జిట్ పాయింట్ల వద్ద ట్రాఫిక్ జామ్‌లు: అప్రమత్తంగా ఉండాలని సూచన

**హైదరాబాద్, జనవరి 11 (తెలంగాణ ముచ్చట్లు)**

సంక్రాంతి పండుగ వచ్చిందంటే చాలు.. భాగ్యనగరం పల్లె బాట పడుతుంది. ఈ ఏడాది కూడా అదే దృశ్యం పునరావృతమవుతోంది. నగరంలోని ప్రధాన బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి.

మిగతా 2లో





### గాలిపటం ఎగరాల్సింది ఆకాశంలో..

**హైదరాబాద్, జనవరి 11 (తెలంగాణ ముచ్చట్లు)**

చైనా మాంజా జనం ప్రాణాలు తీస్తున్నాయి. బాధిత కుటుంబాల్లో విషాదం నింపుతోంది. విచ్చలవిడిగా సాగుతున్న విక్రయాలతో పక్షులు, మనుషులకు ముప్పు వాటిల్లుతోంది. ప్రధానంగా ద్విచక్ర వాహన చోదకులు, పాదచారులు ప్రమాదాల బారినపడుతున్నారు. పతంగుల పండగ నేపథ్యంలో 'గాలిపటం ఎగరాల్సింది ఆకాశంలో.. అమాయక ప్రాణాల్లో కాదు' అంటూ హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ట్వీట్ చేశారు.
చైనీస్ మాంజా దారం తెగదు..

2లో

### తెలంగాణ ముచ్చట్లు దినపత్రిక క్యాలెండర్ ఆవిష్కరించిన

# రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

- తెలంగాణ ముచ్చట్లు క్యాలెండర్ ఆవిష్కరణ
- ప్రాంతీయ పత్రికల పాత్ర కీలకం: మంత్రి
- ఎస్సీ–ఎస్టీ–మైనార్టీల సంక్షేమ సమాచారం చేరవేయాలన్న సూచన



**హైదరాబాద్,జనవరి11 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ ముచ్చట్లు దినపత్రిక నూతన సంవత్సర క్యాలెండర్‌ను రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదివారం హైదరాబాద్ లోని ఆయన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, ప్రజల జీవితాలకు సంబంధించిన సమస్యలు, అభివృద్ధి అంశాలు, సంక్షేమ పథకాల అమలు వంటి విషయాలను సమాజానికి తెలియజేయడంలో ప్రాంతీయ దినపత్రికల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. ప్రజాస్వామ్యంలో మీడియా ఒక బలమైన వేదికగా పనిచేస్తూ, ప్రజల గొంతుకగా నిలవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

మిగతా 2లో



# ఎన్ రాం చందర్ రావుకు

## 'స్వామి వివేకానంద ఎక్సలెన్స్ అవార్డు–2026'

- నలభై ఏళ్ల ప్రజాసేవ–సంస్థాగత ప్రయాణానికి గుర్తింపు
- తెలంగాణ మేధావుల ఫోరం ఆధ్వర్యంలో సత్కారం
- వివేకానంద ఆలోచనలను ఆచరణలో పెట్టే సంకల్పం

**హైదరాబాద్, జనవరి 11 (తెలంగాణ ముచ్చట్లు)**

స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని నలభై ఏళ్ల ప్రజాసేవ-సంస్థాగత ప్రయాణాన్ని గుర్తిస్తూ తెలంగాణ భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రాం చందర్ రావుకు 'స్వామి వివేకానంద ఎక్సలెన్స్ అవార్డు-2026'ను ప్రదానం చేశారు. ఈ సత్కారాన్ని తెలంగాణ మేధావుల ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించారు.
ఈ సందర్భంగా తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డా. రాజు నారాయణ ముదిరాజుకు

మిగతా 2లో



### పార్క్‌కు ఆ మహనీయుడి పేరు పెట్టడం సంతోషంగా ఉంది

**హైదరాబాద్, జనవరి 11 (తెలంగాణ ముచ్చట్లు)**

తెలుగు జాతి గౌరవాన్ని ప్రపంచానికి చాటిన మహనీయుడు ఎన్టీఆర్ అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం నాడు ఖమ్మంలో ఎన్టీఆర్ పార్క్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఈ పార్క్‌కు మహనీయుడు ఎన్టీఆర్ పేరు పెట్టడం సంతోషంగా ఉందన్నారు. ఖమ్మం నగర ప్రజలు సహకరిస్తే ఖాళీ స్థలాలను వినియోగంలోకి తీసుకువస్తామని తెలిపారు. ఈ జిల్లాలో మంచి అధికారులు ఉన్నారని సంతోషం వ్యక్తం చేశారు. పేదలకు ఎక్కడా అన్యాయం జరగటానికి

2లో



# రేవంత్ రెడ్డి నిజాయితీ కలిగిన మోసగాడు

- నిరుద్యోగుల ఆందోళనపై ప్రభుత్వం స్పందించాలి
- ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి
- తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్‌లో చేరిన కొత్త నేతలు

**హైదరాబాద్, జనవరి 11 (తెలంగాణ ముచ్చట్లు):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిను ఉద్దేశించి భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి నిజాయితీ కలిగిన మోసగాడని, అందుకే తెలంగాణలోని అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. ఆనాటి వెనుకటి రోజులు తెస్తానని ప్రజలను భయపెట్టి, మోసం చేసేవారికే అధికారం ఇస్తారని ముందే చెప్పి అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు అదే పని చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో రాజేంద్రనగర్ నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు, వారి అనుచరులు కేటీఆర్ సమక్షంలో భారత రాష్ట్ర సమితిలో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, పార్టీ సీనియర్ నేత కార్తీక్ ఇంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, రెట్టింపు పెన్షన్లు, రైతుబంధు, దళిత బంధు, రెండు లక్షల ఉద్యోగాలు, పీఆర్సీ వంటి అనేక హామీలు ఇచ్చి ఒక్కదాన్నీ

మిగతా 2లో



## సంక్రాంతి సెలవులతో మేడారంలో ముందస్తు

# భక్తుల సందడి

(మొదటి పేజీ తరువాయి)



పగిడిద్దరాజుల గద్దె వద్దకు చేరుకొని పుసుకు, కుంకుమ సమర్పిస్తారు. అలాగే వనదేవతలకు నిలువెత్తు బంగారం (బెల్లం) తూకంలో సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు. మేడారం వైపు వేలాది వాహనాలు రావడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ములుగు జిల్లా యంత్రాంగం, పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. వస్రా, తాడ్వాయి పాయింట్ల వద్ద అదనపు బలగాలను మోహరించారు.

గతంలో తలెత్తిన ఇబ్బందులు దృష్టిలో ఉంచుకొని భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు. భక్తులకు తాగునీరు, మరుగుదొడ్లు వంటి కనీస వసతులతోపాటు గద్దెల వద్ద క్యూలైన్లను పర్యవేక్షిస్తున్నారు. బస్టాండ్ తో పాటు ముఖ్యమైన ప్రదేశాల్లో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేశారు. జాతర సందర్భంగా పోలీసులకు, వాలంటీర్లకు, అధికారులకు భక్తులు సహకరించాలని ఆలయ సిబ్బంది కోరుతున్నారు. ఆదివారం తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి సీతక్క మేడారాన్ని సందర్శించి మొక్కులు చెల్లించుకున్నారు.

## తెలంగాణ ముచ్చట్లు దినపత్రిక క్యాలెండర్ ఆవిష్కరించిన

# రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

(మొదటి పేజీ తరువాయి)



ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు ప్రజలకు స్పష్టంగా చేరేలా పత్రికలు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.

అనంతరం తెలంగాణ ముచ్చట్లు చీఫ్ ఎడిటర్ బొల్లెపాక రాజేష్ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు శాలువా కప్పి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు నిజమైన సమాచారం అందిస్తూ, పత్రిక మరింత అభివృద్ధి సాధించాలని ఈ సందర్భంగా ఆకాంక్ష వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో టీఎంజెఎఫ్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు బూర్గుల నాగేందర్, గుర్రపు సంజయ్, గుర్రపు హర్ష తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ రాం చందర్ రావుకు

## 'స్వామి వివేకానంద ఎక్సలెన్స్ అవార్డు–2026'

(మొదటి పేజీ తరువాయి)



ఎన్ రాం చందర్ రావు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. సమాజానికి చేసిన సేవలు, సంస్థాగతంగా చేపట్టిన కార్యక్రమాలు ఈ అవార్డుకు కారణమని ఆయన పేర్కొన్నారు.

స్వామి స్వామి వివేకానంద ఆలోచనలను ఆచరణలో పెట్టుతూ, సమాజ సేవకు అంకితభావంతో మరింత కృషి చేస్తానని ఎన్ రాం చందర్ రావు స్పష్టం చేశారు. యువతలో విలువలు, దేశభక్తి, సేవాభావాన్ని పెంపొందించడమే తన లక్ష్యమని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు.

## పార్క్‌కు ఆ మహనీయుడి పేరు పెట్టడం సంతోషంగా ఉంది

(మొదటి పేజీ తరువాయి)



వీలులేదని అధికారులకు గతంలోనే స్పష్టం చేశామని చెప్పుకొచ్చారు.

రహదారులు విస్తరించుకోవాల్సిన అవసరం ఉందని అందుకు ప్రజలు అధికారులకు సహకరించాలంటూ మంత్రి విజ్ఞప్తి చేశారు. అలాగే డ్రైన్ల నిర్మాణానికి సైతం తాము సిద్ధంగా ఉన్నామని.. ప్రజలు సహకరిస్తే పనులు వెంటనే పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ఖమ్మంలో అన్ని కాలనీల్లో గతంలో వేల ఇళ్ల నిర్మాణం చేశామని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసుకున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఖమ్మం నివాసయోగ్యమైన నగరంగా ఉందని ఈ సందర్భంగా వివరించారు.

ఖమ్మం పరిసర ప్రాంతాలకు అన్ని జాతీయ రహదారులను తీసుకువచ్చామని చెప్పారు. రానున్న రోజుల్లో ఖమ్మం నుంచి రాజమహేంద్రవరానికి గంటన్నరలో వెళ్లతారని చెప్పారు. స్వార్థం, స్వలాభం కోసం అభివృద్ధికి అడ్డుపడితే నష్టపోతామంటూ నగర ప్రజలకు మంత్రి హితవు పలికారు. భవిష్యత్తు తరాలు ఆరోగ్యంగా ఉండాలంటే ఆరోగ్యకర వాతావరణం ఏర్పాటు చేయాల్సి ఉందని చెప్పారు.

హైదరాబాద్‌ను కాలుష్య రహితంగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని స్పష్టం చేశారు. నగర కార్పొరేటర్ల కోరిక మేరకు ఖమ్మం నగరాభివృద్ధికి ముఖ్యమంత్రి నిధులు కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. మార్చిలోపు ముఖ్యమంత్రిని ఒప్పించి అభివృద్ధికి నిధులు తీసుకువస్తానని నగర ప్రజలకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హామీ ఇచ్చారు.

## మునిసిపల్ ఎన్నికల్లో నాలుగోసారి బీఆర్ఎస్ ఓటమి ఖాయం

(మొదటి పేజీ తరువాయి)

పెద్దపల్లి జిల్లా రామగుండంలో ఆదివారం జరిగిన బహిరంగసభలో 1,700 మంది నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్‌లను పంపిణీ చేసిన భట్టి విక్రమార్క.. రూ.169 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.

అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. పేదవాడికి ఇల్లు కట్టిస్తే కమీషన్లు రావని.. రూ.1.5 లక్షల కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి గత పదేళ్ల బీఆర్ఎస్ సర్కారు దోచుకుందని, కానీ తమ ప్రభుత్వం రూ.22,500 కోట్లతో రాష్ట్రంలో 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. పేదవాడైతే చాలు..

పింక్ చొక్కా ఉన్నా ఇందిరమ్మ ఇల్లు కేటాయిస్తామన్నారు. త్వరలో కార్మిక సంఘాలు, కోల్‌బెల్ట్ ప్రాంత ప్రజా ప్రతినిధులతో ఉమ్మడి సమావేశం నిర్వహించి సింగరేణి కార్మిక సమస్యలకు పరిష్కారం కనుగొందామని చెప్పారు.

## నిజామాబాద్‌లో సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

(మొదటి పేజీ తరువాయి)



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజల సమస్యలను ప్రాధాన్యతగా తీసుకుని పరిష్కరిస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా వైద్య ఖర్చులతో ఇబ్బందిపడుతున్న కుటుంబాలకు సీఎం సహాయ నిధి ఎంతో ఊరట కలిగిస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# సంక్రాంతి పండుగతో ఖాళీ అవుతున్న హైదరాబాద్

(మొదటి పేజీ తరువాయి)



గడిచిన మూడు రోజుల్లోనే నగరం నుంచి సుమారు 30 లక్షల మందికి పైగా ప్రయాణికులు తమ స్వగ్రామాలకు తరలివెళ్లారు. భాగ్యనగరం నుంచి ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని ఇతర జిల్లాలకు వెళ్లే ప్రయాణికులతో ప్రధాన కూడళ్లు కిటకిటలాడుతున్నాయి. ప్రధాన కేంద్రాలైన దిల్‌సుక్ నగర్, ఉప్పల్, ఎల్బీనగర్, హయత్ నగర్, జేబీఎస్ బస్టాండ్లలో ప్రయాణికుల తాకిడి విపరీతంగా పెరిగింది. బస్టాండ్లు ప్రయాణికులతో నిండిపోయినప్పటికీ.. సమయానికి బస్సులు రాకపోవడంతో మహిళలు, వృద్ధులు, చిన్న పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

స్వగ్రామాలకు వెళ్లేందుకు నగరవాసులు పెద్ద సంఖ్యలో బయలుదేరడంతో బస్టాండ్లన్నీ రద్దీగా మారాయి. టిక్కెట్లు దొరక్క, బస్సుల కోసం గంటల తరబడి వేచి చూస్తూ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక మహిళలు, వృద్ధులు, చిన్న పిల్లలతో వచ్చిన వారైతే.. మరిన్ని తీవ్ర అవస్థలు పడుతున్నారు.

ప్రయాణికుల డిమాండ్ భారీగా పెరగడంతో రేపటి వరకు బస్సులు, రైళ్లలో అన్ని రిజర్వేషన్లు పూర్తిగా ఫుల్ అయ్యాయి. ఆన్‌లైన్, కౌంటర్ రిజర్వేషన్లు అందుబాటులో లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర నిరాశ వ్యక్తం చేస్తున్నారు. సంక్రాంతి రద్దీ దృష్ట్యా ఆర్టీసీ, రైల్వే శాఖలు ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నప్పటికీ, ప్రయాణికుల సంఖ్యకు అవి సరిపోవడం లేదు. రేపటి వరకు అన్ని ప్రధాన రైళ్లు, ఆర్టీసీ బస్సుల్లో రిజర్వేషన్లు పూర్తిగా నిండిపోయాయి.

సమయానికి బస్సులు రాకపోవడం ప్రయాణికుల సమస్యలను మరింత పెంచుతోంది. షెడ్యూల్ ప్రకారం బస్సులు నడవకపోవడంతో బస్టాండ్లలో గందరగోళం నెలకొంది. కొన్నిచోట్ల ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ అధికారులను ప్రశ్నించారు.

ప్రయాణికుల రద్దీ నేపథ్యంలో అదనపు బస్సులు నడపాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. రద్దీని నియంత్రించేందుకు ఆర్టీసీ అధికారులు చర్యలు చేపట్టాలని నగరవాసులు కోరుతున్నారు.

రిజర్వేషన్లు దొరక్కపోవడంతో చాలా మంది ప్రైవేట్ ట్రావెల్స్‌ను ఆశ్రయిస్తున్నారు. దీన్నే అవకాశంగా తీసుకుని.. ప్రైవేట్ బస్సుల్లో అధిక ఛార్జీలు వసూలు చేస్తున్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. రెట్టింపు ధరలు వసూలు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ వాహనాల్లో సీట్లు దొరకని ప్రయాణికులు చేసేదేమీ లేక ప్రైవేట్ ట్రావెల్స్‌ను ఆశ్రయిస్తున్నారు. దీన్ని అదునుగా చేసుకున్న ప్రైవేట్ ట్రావెల్స్ యజమానులు.. సాధారణ చార్జీల కంటే మూడు రెట్లు అధిక ధరలు వసూలు చేస్తున్నట్లు ప్రయాణికుల నుంచి రవాణా శాఖ అధికారులకు ఫిర్యాదులు అందుతున్నాయి.

హైదరాబాద్ నుంచి బయటకు వెళ్లే ఎగ్జిట్ పాయింట్ల వద్ద ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. ముఖ్యంగా విజయవాడ వైపు వెళ్లే పంతంగి టోల్ ప్లాజా, వరంగల్ వైపు వెళ్లే రహదారులపై కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ప్రయాణికులు తమ ప్రయాణ సమయాన్ని ముందుగానే ప్లాన్ చేసుకోవాలని, ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

అధికారిక లెక్కల ప్రకారం, గడిచిన మూడు రోజుల్లో హైదరాబాద్ నగరం నుంచి 30 లక్షల మందికి పైగా ప్రయాణికులు తరలివెళ్లినట్లు సమాచారం. ఈ సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

# రేవంత్ రెడ్డి నిజాయితీ కలిగిన మోసగాడు

(మొదటి పేజీ తరువాయి)




అమలు చేయకుండా ప్రజలను ఇరవై నాలుగు నెలలుగా మోసం చేస్తున్నారని విమర్శించారు.

రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగ యువత ఆందోళనలు చేస్తున్న విషయాన్ని ప్రభుత్వం గౌరవించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువతీ-యువకులను పిలిచి ప్రభుత్వం భరోసా ఇవ్వాలని, ఇచ్చిన మాట ప్రకారం వెంటనే రెండు లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు విడుదల చేయాలని కోరారు. కేవలం మీడియా హెడ్‌లైన్ల కోసమే ప్రకటించిన జాబ్ క్యాలెండర్‌ను తూతూ మంత్రంగా కాకుండా అమలు చేయాలని అన్నారు. దిల్‌సుఖ్‌నగర్, ఆర్టీసీ క్రాస్‌రోడ్ సహా పలు ప్రాంతాల్లో జరుగుతున్న నిరసనలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు.

ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో బట్టల షాపు ప్రారంభానికి వెళ్లిన రేవంత్ రెడ్డి, పక్కనే ఉన్న గాంధీనగర్‌లో గతంలో నిరుద్యోగులతో సమావేశమైన ప్రాంతానికి వెళ్లలేదని కేటీఆర్ ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగాల నియామక పత్రాలను తమవేనని చెప్పుకోవడం అబద్ధమని, ఆ అబద్ధాలు ఎక్కువ రోజులు నిలవవని అన్నారు. రైతులు, రైతు కూలీలు, కౌలుదారులు, విద్యార్థులు, మహిళలు, వృద్ధులు, ప్రభుత్వ ఉద్యోగులు ఇలా ప్రతి వర్గాన్ని మోసం చేశారని కేటీఆర్ ఆరోపించారు. హామీల అమలుపై ప్రశ్నిస్తే ముఖ్యమంత్రి అసహనం వ్యక్తం చేస్తూ, ప్రతిపక్షాలు, ప్రజలపై అనుచిత భాష వాడుతున్నారని విమర్శించారు.

## గాలిపటం ఎగరాల్సింది ఆకాశంలో..

(మొదటి పేజీ తరువాయి)



కానీ మనుషుల మెడలు, పక్షుల రెక్కలు తెగ్గోస్తుంది. మీ క్షణికానందం.. మరొకరి ఇంట తీరని విషాదం కాకూడదు. నిషేధిత చైనా మాంజా అమ్మినా, వాడినా కఠిన చర్యలు తప్పవు. పండగని పండగలా జరుపుకోండి. ప్రాణాలు తీసి కాదు' అంటూ సజ్జనార్ హెచ్చరించారు.

కాగా, చైనా మాంజా విక్రయంపై నగర పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచారు. దీని వినియోగాన్ని రాష్ట్ర ప్రభుత్వం 2016లో, జాతీయ హరిత ట్రైబ్యునల్ 2017లో నిషేధించింది. అయినప్పటికీ విచ్చలవిడిగా సాగుతున్న విక్రయాలతో పక్షులు, మనుషులకు ముప్పు వాటిల్లుతోంది. ప్రధానంగా ద్విచక్ర వాహనచోదకులు, పాదచారులు ప్రమాదాల బారినపడుతున్నారు. దీంతో నెల రోజులుగా నిఘా ఉంచిన అధికారులు ఇప్పటి వరకు 103 కేసులు నమోదు చేసి, 143 మందిని అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.1.24కోట్ల విలువైన 6226 బాబిన్ల మాంజా స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం హైదరాబాద్‌లో చైనా మాంజాకు మరో వ్యక్తి బలి అయ్యాడు. బైక్‌పై వెళ్తున్న సాయి వర్ధన్ మెడకు మాంజా చుట్టుకోవడంతో అతడి చెయ్యి, మెడకి తీవ్ర గాయమైంది. దీంతో, వెంటనే సాయి వర్ధన్‌ను ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఈ ఘటన ఉప్పల్ స్టేడియం మెట్రో స్టేషన్ సమీపంలో జరిగింది.

## రఘు నాథపాలెం మండలం వర ప్రదాయిని

# మంచుకొండ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్





- దశాబ్దాల సాగునీటి కల సాకారం చేయనున్న మంచుకొండ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్
- లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ కు రూపకల్పన చేసిన మంత్రి తుమ్మల
- 66 కోట్లతో లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్
- సీఎం రేవంత్.... మంత్రి తుమ్మల పై హర్షం వ్యక్తం చేస్తున్న రైతాంగం



**ఖమ్మం బ్యూరో, జనవరి 11(తెలంగాణ ముచ్చట్లు):** సారవంతమైన భూములు రెక్కల కష్టం చేసే రైతులు కానీ సాగునీరు కలగా మారింది దశాబ్దాల సాగు నీటి కలను సాకారం చేసి రైతాంగం తలరాత మార్చాలని లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ కు రూపకల్పన చేశారు మంత్రి తుమ్మల, గిరిజనుల భూములను సస్య శ్యామలం చేసేలా రఘునాథపాలెం మండలం వర ప్రధాయనిగా మారింది మంచుకొండ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ రఘునాథ పాలెం మండలం.ఖమ్మం నియోజక వర్గంలో ఉన్న ఈ మండలం ఖమ్మం నగరానికి కూత వేటు దూరంలో ఉంది.అక్కడ భూములు సారవంత మైనవే కాదు ఖరీదైన భూములు.ఎకరం యాభై లక్షల నుంచి కోటి దాకా ధరలు ఉన్నాయి.సాగు నీటి వసతి లేక పోయినా రియల్ ఎస్టేట్ వ్యాపారం వల్ల ఉద్యాన పంటలకు బాగా అనువైన భూములు కావడంతో ఖరీదు ఎక్కువ.గిరిజనులు ఎక్కువగా ఉన్న గ్రామాల్లో సాగు నీటి కష్టాలు. దశాబ్దాలుగా సాగు నీటి కోసం ఎదురు చూపులు. ఇలాంటి తరుణంలో ఖమ్మం అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున బరిలో నిలిచిన తుమ్మల ఎన్నికల ప్రచారంలో సాగు నీటి కలను సాకారం చేసేలా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ తెస్తానని తుమ్మల వాగ్దానం చేశారు. రేవంత్ సర్కార్ కొలువు తీరడంతో ఇచ్చిన మాట నిలుపుకున్నారు మంత్రి తుమ్మల. మంచుకొండ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ రూపకల్పన ఇలా రఘునాథ పాలెం మండలం భూములకు పక్కనే సాగర్ కెనాల్ ఉన్నా మరోపక్క మున్నేరు ఉన్నా సాగు నీటి వసతికి అనేక ఆటంకాలు. భౌగోళికం గా భూములు కాలువ ఏరు కంటే ఎత్తుగా ఉండటంతో సాగు నీరు అందని దుస్థితి.ఖమ్మం నియోజక వర్గ ఎమ్మెల్యే గా తుమ్మల ఎన్నికవ్వడం మంత్రి వర్గంలో ఉండడంతో తన సొంత నియోజక వర్గంలో రైతాంగం సాగు నీటి కలను సాకారం చేయాలని పట్టుదలతో తుమ్మల స్వయంగా రూపకల్పన చేసారు మంచుకొండ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ కు నాగార్జున సాగర్ మేజర్ కెనాల్ పై వెంకటాయపాలెం డీఫ్ కట్ వద్ద పంప్ హౌస్ ఏర్పాటు చేసి అక్కడ నుంచి సాగు నీళ్ళను లిఫ్ట్ చేయడానికి రూపకల్పన చేసారు. పంప్ హౌస్ వద్ద లిఫ్ట్ చేసిన నీళ్లు పైప్ లైన్ ద్వారా మంచుకొండ దేవర బోడు గుట్ట పై నిర్మాణం చేసిన డెలివరీ సిస్టర్న్ కు చేరుతాయి. సాగర్ కెనాల్ నుంచి 38 క్యూసెక్కుల నీటిని లిఫ్ట్ చేస్తే పైప్ లైన్ ద్వారా 9 కిలో మీటర్లు దూరంలో ఉన్న డెలివరీ సిస్టర్న్ కు చేరతాయి అక్కడ నుంచి 36 చెరువులకు నీరు పైప్ లైన్లు ద్వారా చేరుతాయి. ఆరు సెగ్మెంట్ లుగా చెరువులను విడతల వారీగా నింపుతారు.మొత్తం పైప్ లైన్లు 35 కిలో మీటర్లు నిడివితో ఉన్నాయి.డెలివరీ సిస్టర్న్ నుంచి చెరువులకు గ్రావిటీ తో నీళ్ళు చేరతాయి.

లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పనులు నిరంతరం పరిశీలన చేస్తున్న మంత్రి తుమ్మల

మంచుకొండ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పనులను మంత్రి తుమ్మల నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారు.పంప్ హౌస్ పనులు పైప్ లైన్ పనులు క్షేత్ర స్థాయిలోకి వెళ్ళి పలుమార్లు పరిశీలన చేసారు.

పెరగనున్న భూగర్భ జలాలు....మత్స సంపద.. జీవ వైవిధ్యం

మంచుకొండ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ వల్ల రఘునాథ పాలెం మండలం సస్య శ్యామలం అవ్వడం తో పాటు, చెరువుల్లో సమృద్ధిగా నీరు నిలవ ఉంటే చుట్టు పక్కల భూగర్భ జలాలు పెరుగుతాయి. దాంతో బోరు బావులుతో సాగు చేసే రైతాంగం కు కష్టాలు తీరినట్లే. చెరువుల్లో నీరు నిండుగా ఉంటే చేపలు పెరగడం తో మత్స్య కారులకు ఉపాధి కలుగుతుంది. చెరువుల్లో నీరు నిండుగా ఉండటం వల్ల కుల వృత్తులు వారికి ఉపాది అవకాశాల తో పాటు జీవ వైవిధ్యం తో పల్లెలు పచ్చగా మారతాయి.మంచు కొండ లిఫ్ట్ ఇరిగేషన్ ఆయకట్టు కింద ఎక్కువగా గిరిజనులు ఉన్నారు.దశాబ్దాల సాగు నీటి కలను సాకారం చేస్తూ మంత్రి తుమ్మల సీఎం రేవంత్ అపర భగీరథులు గా నిలిచారని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు..

## వెల్టూర్ లో వారాంతపు కూరగాయల సంతకు శ్రీకారం చుట్టిన సర్పంచ్ అశోక్



**పెద్దమందడి,జనవరి11(తెలంగాణ ముచ్చట్లు):**పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామంలో గ్రామ సర్పంచ్ అశోక్ ఆధ్వర్యంలో గ్రామస్తులు సమావేశమై వారాంతపు కూరగాయల సంత ఏర్పాటు అంశంపై చర్చించారు. చాలాకాలంగా గ్రామంలో కూరగాయల సంత ఏర్పాటు చేయాలనే అభిప్రాయం ఉన్నప్పటికీ, కొన్ని కారణాల వల్ల అది అమలుకు నోచుకోలేదని గ్రామస్తులు ఈ సందర్భంగా తెలిపారు.నూతన గ్రామ సర్పంచ్ అశోక్ గ్రామ ప్రజలతో విస్తృతంగా చర్చించి, కూరగాయల సంత ఏర్పాటు ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. గ్రామస్తుల అభిప్రాయం మేరకు వారాంతపు కూరగాయల సంతను ప్రతి ఆదివారం నిర్వహించాలనే నిర్ణయం తీసుకున్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ అశోక్ మాట్లాడుతూ.. కూరగాయల సంత ఏర్పాటు కోసం ప్రస్తుతం అస్తవ్యస్తంగా ఉన్న స్థలాన్ని శుభ్రం చేసి సంతకు అనుకూలంగా అభివృద్ధి చేస్తామని, అలాగే సంత నిర్వహణకు అవసరమైన సదుపాయాలు, మౌలిక వసతులను త్వరలోనే సమకూరుస్తామని తెలిపారు.ఈ సంత ద్వారా రైతులకు తమ పంటను నేరుగా విక్రయించే అవకాశం లభిస్తుందని, గ్రామస్తులకు నాణ్యమైన కూరగాయలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అశోక్, మాజీ జెడ్పిటిసి రఘుపతి రెడ్డి, మాజీ సర్పంచ్ బాలచంద్రయ్య, మాజీ వైస్ ఎంపీపీ సాక వెంకటయ్య, మాజీ ఉపసర్పంచ్ లు నాగమణి నరేష్, మల్లికార్జున్, రిటైర్డ్ సిఐ బాల్ రెడ్డి, పెద్దమందడి మండలం బిజెపి మాజీ అధ్యక్షుడు రమేష్,రమేష్ గౌడ్, దండు నరేష్, డీలర్ విజయ్ కుమార్, మల్లక్ సురేష్ కుమార్, బుషయ్య, కమ్మరి శ్రీను, శాంతయ్య, జగతి రెడ్డి, అడివన్న ,చిత్తూరు కృష్ణారెడ్డి, భాస్కర్ గౌడ్, నాగరాజు గౌడు, రంజిత్ గౌడ్, నవీన్, ఆలయ పూజారి శ్రీకాంత్, బాల్ రెడ్డి, గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



## ముమ్మర ప్రచారం భారీ ఏర్పాట్లు

-శతాబ్ది ఉత్సవ ముగింపు సభకు సన్నద్ధమవుతున్న ఖమ్మం

**ఖమ్మం బ్యూరో, జనవరి 11(తెలంగాణ ముచ్చట్లు):** భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభకు విస్తృత ప్రచారం జరుగుతుంది. అదే రీతిలో సభను జయప్రదం చేసే క్రమంలో ఏర్పాట్లను ముమ్మరం చేశారు. లక్షలాది మంది ఈ సభకు హాజరు కావడంతో పాటు 15వేల మంది జనసేవాదళ్ కార్యకర్తలు నగర వీధుల్లో కవాతు చేయనున్నారు. జనసేవాదళ్ కార్యకర్తలతో పాటు ప్రదర్శనలో పాల్గొనే సిపిఐ కార్యకర్తలు, ప్రజా సంఘాల బాధ్యులు కుడిచేతితో జెండా పట్టుకుని ఎడమ చేయి పైకెత్తి నినదించే రీతిలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకు 40వేల జెండాలను సిద్ధం చేస్తున్నారు. గడిచిన వారం రోజులుగా పార్టీ కార్యాలయంలో సిపిఐ కార్యకర్తలు కర్రలకు జెండాలను అమర్చే పనిలో నిమగ్నమయ్యారు. మరో పక్క ఖమ్మం నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా భారీ ఫ్లెక్సీలు, కటౌట్లను ఏర్పాటు చేస్తున్నారు. కమ్యూనిస్టు పార్టీ నేపథ్యం, పోరాట చరిత నేటి తరానికి తెలియజేయడంతో పాటు దేశ ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు, పాలకుల వైఖరి ప్రజా పోరాటాల అవసరాలను తెలియజేస్తూ ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నారు.. అమరుల త్యాగాలను గుర్తు చేస్తూ భవిష్యత్తు పోరాటాలకు పిలుపునిచ్చేవిధంగా ప్రత్యేకంగా కటౌట్లను ఏర్పాటు చేస్తున్నారు. ఈనెల 13న ఖమ్మం నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా భారీ బెలూన్లను ప్రచార కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేయనున్నారు. 14న జిల్లా వ్యాప్తంగా ఇంటింటిపై ఎర్రజెండాను ఎగురవేసేందుకు కార్యకర్తలను సంసిద్ధులను చేశారు. ఇప్పటికే జీపుజాతాలు ద్వారా రెండు దఫాలు జిల్లా వ్యాప్తంగా ప్రచారం నిర్వహించగా ఇప్పుడు అన్ని గ్రామాల్లోనూ ఆటోల ద్వారా శతాబ్ది సంబురాల ముగింపు సభ ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. మరో పక్క 40 దేశాల నుంచి హాజరయ్యే ప్రతినిధులకు ఆహ్వానం పలకడంతో పాటు సిపిఐ జాతీయ, రాష్ట్ర నాయకులకు స్వాగత బ్యానార్లను ఏర్పాటు చేస్తున్నారు. 12న కవి సమ్మేళనం ఏర్పాటు చేశారు. మొత్తంగా ప్రచార కార్యక్రమాలతో ఒక పక్క ప్రచారం మరో పక్క ముమ్మర ఏర్పాట్లతో సభను జయప్రదం చేసేందుకు భారత కమ్యూనిస్టు పార్టీ ఖమ్మం జిల్లా యావత్ యంత్రాంగం నిమగ్నమైంది.





## ఏకశిలా నగర్ భూవివాదంపై ఈటల రాజేందర్ ఘాటు విమర్శలు

- ల్యాండ్ మాఫియా–అధికారుల కుమ్మక్కు తక్షణమే ఆపాలి
- 24 గంటల్లో అరెస్టులు లేకపోతే ఉద్యమం ఉధృతం

**మేడ్చల్–మల్కాజ్గిరి , జనవరి 11 (తెలంగాణ ముచ్చట్లు)** :మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పోచారం మున్సిపాలిటీ పరిధిలోని ఏకశిలా నగర్‌లో జరుగుతున్న భూవివాదంపై పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఏకశిలా నగర్‌ను సందర్శించిన ఆయన బాధిత ప్లాట్ ఓనర్లను పరామర్శించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మాట్లాడిన ఈటల రాజేందర్, 1985లో అప్పటి కొర్రేముల గ్రామ పరిధిలో 146 ఎకరాల్లో 2086 ప్లాట్లు ఏర్పాటు చేయగా, సింగరేణి, విద్యుత్ శాఖ ఉద్యోగులు, పాల వ్యాపారులు, కూరగాయల వ్యాపారులు వంటి సామాన్య ప్రజలు స్థలాలు కొనుగోలు చేశారని తెలిపారు. అయితే రెవెన్యూ రికార్డుల్లోని లోపాలను ఆసరాగా చేసుకుని వెంకటేష్ అనే వ్యక్తి ల్యాండ్ మాఫియాతో కలిసి 47 ఎకరాల భూమిని అక్రమంగా పట్టా చేసుకున్నాడని ఆరోపించారు.డబ్బులకు ఆశపడి అప్పటి రెవెన్యూ అధికారులు, పోలీసులు గుండాలకు మద్దతు ఇచ్చారని విమర్శించారు. కాలనీవాసులు ఐక్యత లేకుండా ఉండటాన్ని ఆసరాగా చేసుకుని, గుండాలు కొట్టడం, చంపుతామని బెదిరించడం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.గత సంవత్సరం ఇదే సమస్యపై తాను స్వయంగా వచ్చి డీజీపీ, కలెక్టర్, ఉన్నతాధికారులతో మాట్లాడానని, సమస్య పరిష్కారమైందని భావించినా మళ్లీ సర్వే పేరుతో అధికారులను పంపడం అన్యాయమన్నారు. వ్యవసాయ భూమి లేకుండా కేవలం ప్లాట్లే ఉన్నాయని స్పష్టంగా ఉన్నా, అసిస్టెంట్ డైరెక్టర్ సర్వేకు రావడం వెనుక కుట్ర ఉందని ఆరోపించారు.

ప్లాట్ ఓనర్లపై గుండాలు దాడి చేయడం తీవ్రంగా ఖండనీయమని, వెంకటేష్‌తో పాటు అతనికి మద్దతిచ్చిన రెవెన్యూ, పోలీస్ అధికారులను వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. 24 గంటల్లో వెంకటేష్‌పై హత్యా నేరం మోపి అరెస్ట్ చేయకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ప్రకటించారు. ప్రజల ప్రాణాలు, ఆస్తులకు రక్షణ కల్పించలేని పాలనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి తీవ్ర విమర్శలు చేశారు. ధరణి అయినా, భూభారతి అయినా ల్యాండ్ మాఫియాలే రాజ్యమేలుతున్నాయని, హైదరాబాద్‌లో ప్లాట్ కొనాలంటే ప్రజలు భయపడే పరిస్థితి ఏర్పడిందన్నారు.బాధితులకు భారతీయ జనతా పార్టీ అండగా ఉంటుందని, కార్యకర్తలు, కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలు అందరూ సహాయానికి సిద్ధంగా ఉన్నారని భరోసా ఇచ్చారు. ప్రజలు ఐక్యంగా ఉండాలని, కంటికి రెప్పలా కాపాడుకుంటామని ఈటల రాజేందర్ హామీ ఇచ్చారు.





## కందుకూరులో మంత్రి తుమ్మల పర్యటన.!

- బండి పార్థసారథ్ రెడ్డి నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి.

**సత్తుపల్లి, జనవరి 11 (తెలంగాణ ముచ్చట్లు):** వేంసూరు మండలంలోని కందుకూరు గ్రామంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హెట్రో డ్రగ్స్ అధినేత బండి పార్థసారథ్ రెడ్డి తో కలిసి పర్యటించారు. ఆయన తన చిరకాల మిత్రుడు బండి గుర్నాథ్ రెడ్డి నివాసంలో కొంతసేపు గడిపారు. ఆ తర్వాత, బండి పార్థసారథ్ రెడ్డి ఏర్పాటు చేసిన ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మంత్రి తుమ్మల అభిమానులు హాజరయ్యారు. పర్యటన సందర్భంగా స్థానిక జనాలతో సానుభూతికరమైన సంభాషణలు జరిపి, గ్రామ అభివృద్ధి, వ్యవసాయ రంగం, రైతుల సంక్షేమం అంశాలను చర్చించారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# సైబర్ నేరగాళ్ల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలి





- పోట్రు మనోజ్ కళ్యాణ్, ఉడతనేని వికాస్ ముఠా సైబర్ దోపిడీ
- అంతర్జాతీయ సైబర్ క్రైమ్ నేరస్థులతో జతకట్టి విదేశాలలో కాల్ సెంటర్ల ద్వారా మోసం
- తుంబూరుకు చెందిన మోదుగ సాయికిరణ్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు
- 24 మందిపై కేసు నమోదు, కేసులో మొత్తం 18 మంది అరెస్టు
- వియం బంజారా పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన పోలీస్ కమిషనర్

**ఖమ్మం బ్యూరో, జనవరి 11(తెలంగాణ ముచ్చట్లు):** సైబర్ నేరాలకు పాల్పడడం ద్వారా ఖమ్మం జిల్లా సత్తుపల్లికి చెందిన పోట్రు మనోజ్ కళ్యాణ్, ఉడతనేని వికాస్ చౌదరి అండ్ ముఠా దోపిడీ చేసిన నగదు మొత్తం రూ. 547.00 కోట్లుగా ఖమ్మం జిల్లా పోలీసులు తేల్చారు. ఈ ముఠా సైబర్ దోపిడీకి సహకరించిన మొత్తం 18 మంది వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పెనుబల్లి పోలీస్ స్టేషన్ లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు.

సీపీ సునీల్ దత్ వెల్లడించిన వివరాల ప్రకారం.. గత నెల 24వ తేదీన సత్తుపల్లి మండలం తుంబూరుకు చెందిన మోదుగ సాయికిరణ్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ జరిపారు.నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన పేరుతో వలవిసిరి ఉడతనేని వికాస్ చౌదరి, పోట్రు మనోజ్ కళ్యాణ్, పోట్రు ప్రవీణ్, మేడ భానుప్రకాష్, మేడా సతీష్, మోరంపూడి చెన్నకేశవ అనే వ్యక్తులు సైబర్ నేరాలకు పాల్పడడం ద్వారా రూ. 547.00 కోట్ల భారీ మొత్తాన్ని కొల్లగొట్టారని గుర్తించామన్నారు.

కేసు విచారణలో భాగంగా నిందితులైన ఉడతనేని వికాస్ చౌదరి, పోట్రు మనోజ్ కళ్యాణ్ ల కుటుంబ సభ్యుల, అనుచరుల బ్యాంక్ అకౌంట్లను పోలీసులు పరిశీలించగా దిగ్భ్రాంతి కలిగించే అంశాలు వెల్లడయ్యాయి. పోట్రు మనోజ్ కళ్యాణ్ బ్యాంకు ఖాతాలో రూ. 114.18 కోట్లు, అతని భార్య మేడా భానుప్రియకు చెందిన రెండు బ్యాంకు ఖాతాల్లో రూ. 45.62 కోట్లు, మనోజ్ కళ్యాణ్ బామ్మర్ది అయినటువంటి మేడా సతీష్ ఖాతాలో రూ. 135.48 కోట్లు, బొమ్మిడాల నాగలక్ష్మి ఖాతాలో రూ. 81.72 కోట్లు, కరీంనగర్ కు చెందిన తాటికొండ రాజు అనే వ్యక్తికి చెందిన నరసింహా కిరాణం అండ్ డెయిరీ ఖాతాలో రూ. 92.54 కోట్లు, ఉడతనేని వికాస్ చౌదరి ఖాతాలో రూ. 80.41 కోట్ల చొప్పున లావాదేవీలు జరిగినట్లు పోలీసులు గుర్తించారు.

సత్తుపల్లి పరిసర గ్రామాలకు చెందిన నిరుద్యోగ యువకులను ఉద్యోగాల కల్పన పేరుతో పిలిపించుకుని, వారికి ఉద్యోగం ఇచ్చి, వారితో ప్రముఖ బ్యాంకుల్లో ఖాతాను తెరిపించి, ఆయా అకౌంట్లలో క్రెడెన్షియల్స్ ను తీసుకుని నిందితులు కోట్ల రూపాయల సైబర్ క్రైమ్ నేరాల సొత్తును జమ చేయడానికి వినియోగించారు. ఈ నేరస్తులు అంతర్జాతీయ సైబర్ క్రైమ్ నేరస్థులతో జతకట్టి విదేశాలలో కాల్ సెంటర్లు నిర్వహిస్తూ వాటి ద్వారా దేశంలోని పౌరులకు పెట్టుబడి, మ్యాట్రిమోనీ, రివార్డు పాయింట్లు, గేమింగ్, బెట్టింగ్, షేర్ మార్కెట్లో పెట్టుబడులు మరియు క్రిప్టో కరెన్సీ ట్రేడింగ్ పేరుతో మోసగించి, ఎవరైనా బాధితుడు వారి మాటలకు ఆకర్షించబడితే అతనిని వారి టెలిగ్రామ్ గ్రూపులలో సభ్యునిగా చేర్చి, తర్వాత వారికి మోసపూరిత లింకులు పంపి వారి అకౌంట్లో నుండి డబ్బులను ఖాళీ చేయడం జరుగుతుంది.

వీరు మొదట సైబర్ క్రైమ్ ద్వారా వచ్చిన నేరపు సొత్తును, వీరి ఏజెంట్ల ద్వారా తెరిపించిన బ్యాంక్ అకౌంట్లోకి బదిలాయించేవారు. తర్వాత ఇట్టి సొమ్మును కొన్ని కరెంట్ ఎకౌంట్లోకి మార్చి, చివరగా తమ పర్సనల్ ఎకౌంట్లోకి అట్టి డబ్బులు చేర్చి, యు ఎస్ డాలర్ మరియు క్రిప్టో కరెన్సీ రూపంలోకి మార్చినట్టుగా తేలినది. ఇట్టి కేసు విచారణలో భాగంగా మొదట పోట్రు ప్రవీణ్ ను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచడం జరిగినది. అలాగే నిందితుల బ్యాంక్ అకౌంట్లో సహాయంతో వారికి ఎకౌంట్లు ఇచ్చి సహకరించిన పలువురు వ్యక్తులను మరియు అకౌంట్స్ ను గుర్తించడం జరుగుతున్నది. క్షేత్రస్థాయిలో కేసు దర్యాప్తు కొనసాగుతుందని నిందితులేవరిని ఉపేక్షించేది లేదని చట్టపకారం చర్యలు తీసుకుంటామని పోలీస్ కమిషనర్ తెలిపారు.

సైబర్ నేరగాళ్ళ పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని అత్యాశకుపోయి కేసుల్లో ఇరుకోవద్దని సూచించారు.

ఈ సైబర్ నేరాల రాకెట్ లో నిందితులకు సహకరించినందుకుగాను సదాశివపాలెం, సీతారాంపురం, రామానగరం, తుమ్మూరు గ్రామాలకు చెందిన జుంజునూరి శివక్రిష్ణ, వడ్లమూడి నరేంద్ర, మల్లాది శివ, సాధు పవన సందీప్, సాదు సంధ్య, సాధు లేఖలను అరెస్ట్ చేశారు.

అదేవిధంగా లింగపాలెం గ్రామానికి చెందిన జొన్నాదుల తిరుమల, కందుకూరి మణికంఠ, తన్నీరు మహేష్, గోళ్లమూడి నాగముఖేష్, కంచపోగు శ్రీనివాస్, రాయల అజయ్ కుమార్, రాయల గోపి, పల్లా గణేష్, రాయల గోపిచంద్, కందుకూరి జగదీష్, కరీంగనర్ కు చెందిన తాటికొండ రాజులను అరెస్ట్ చేశారు. ఈ కేసులో పోట్రు ప్రవీణ్ ను ఇప్పటికే అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చినట్లు సీపీ సునీల్ దత్ వివరించారు.

# ముగ్గులు మన సంస్కృతికి ప్రతీక పనగట్ల చక్రపాణి గౌడ్





**కుషాయిగూడ, జనవరి 11 (తెలంగాణ ముచ్చట్లు):** సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం కుషాయిగూడ శుభోదయ కాలనీ ఫేజ్-1 మరియు ఫేజ్-2లలో ముగ్గుల పోటీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కాలనీల అసోసియేషన్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో, పనగట్ల చక్రపాణి గౌడ్ నేతృత్వంలో నిర్వహించారు.ముగ్గుల పోటీల్లో వందలాది మహిళలు పాల్గొని తమ కళా నైపుణ్యాన్ని అద్భుతమైన ముగ్గుల రూపంలో ప్రదర్శించారు. పోటీల్లో గెలుపొందిన మహిళలకు పనగట్ల చక్రపాణి గౌడ్ సతీమణి ప్రసన్న గౌడ్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా పనగట్ల చక్రపాణి గౌడ్ మాట్లాడుతూ, “ముగ్గు అనేది కేవలం ఇంటి ముందు వేసే అలంకరణ మాత్రమే కాదు, అది మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక. ఈ సంప్రదాయాన్ని మన పిల్లలకు, రాబోయే తరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది” అని అన్నారు. గెలుపొందిన మహిళలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, కార్యక్రమానికి సహకరించిన రెండు కాలనీల అసోసియేషన్ సభ్యులు మరియు కాలనీ పెద్దలకు పేరు పేరున ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో శుభోదయ కాలనీ ఫేజ్-1 పెద్దలు చెంచు రెడ్డి, అధ్యక్షులు మల్లేష్, రవి చారి; శుభోదయ కాలనీ ఫేజ్-3 పెద్దలు కాసుల నందం గౌడ్, కాలనీ అధ్యక్షులు తిగుళ్ల రాంచందర్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, సిద్ధ రాములు, భాను, ప్రధాన కార్యదర్శి మల్లేష్, కమిటీ సభ్యులు బాలరాజు గౌడ్, కృష్ణ, రమేష్ బాబు, ప్రసాద్ కృష్ణ, రమేష్, శ్రీకాంత్ గౌడ్; మహిళా సభ్యులు శోభారాణి, రమాదేవి; మాజీ అధ్యక్షుడు వీర నారాయణ రెడ్డి, లక్ష్మీనారాయణ గౌడ్, శెట్టి రాఘవేందర్, పల్లె కృష్ణ రెడ్డి, షాలిని, మాధవి, బన్నాపురం నాగరాజు, నీరుడు బాబు, రాంగిరివార్ నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.

# కట్ట మైసమ్మ గుడి ఘటనతో నేరేడ్మెట్‌లో ఉద్రిక్తత





- నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్
- గుడి వద్దకు చేరుకున్న తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు

**మల్కాజిగిరి, జనవరి 11 (తెలంగాణ ముచ్చట్లు):** మల్కాజిగిరి నియోజకవర్గం నేరేడ్మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సఫిల్‌గూడలో ఉన్న కట్ట మైసమ్మ దేవాలయంలో చోటుచేసుకున్న అపవిత్ర ఘటన తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. నిన్న రాత్రి దేవాలయం వద్ద ఉన్న బొడ్రాయిపై ఓ అగంతకుడు అమ్మవారి విగ్రహం ముందు మల-మూత్ర విసర్జన చేసినట్లు స్థానికులు గుర్తించారు.ఈ ఘటనను గమనించిన స్థానికులు వెంటనే నిందితుడిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. విషయం తెలిసిన వెంటనే పెద్ద సంఖ్యలో ప్రజలు గుడి వద్దకు చేరుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు నేరేడ్మెట్ పోలీసులు భారీగా బలగాలను మోహరించి భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.ఈ ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్థానికులు, ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉండగా, నిందితుడిని ఎన్కౌంటర్ చేయాలంటూ డిమాండ్ చేస్తూ తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు కట్ట మైసమ్మ గుడి వద్దకు చేరుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, “హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదు. ఇలాంటి ఘటనలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలి” అని డిమాండ్ చేశారు.ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతున్న నేపథ్యంలో గుడి పరిసర ప్రాంతాల్లో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులో ఉన్నప్పటికీ, పోలీసులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు.

# పుట్టినరోజు వేడుకకు హాజరై చిన్నారిని ఆశీర్వదించిన ఎమ్మెల్యే



**పెద్దమందడి,జనవరి11(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం అల్వాల గ్రామానికి చెందిన హేమవర్ధన్ రెడ్డి-అనూష దంపతుల కుమారుడు విహాన్ రెడ్డి పుట్టినరోజు వేడుకలకు వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి హాజరై చిన్నారిని ఆశీర్వదించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పిల్లల జీవితాల్లో కొన్ని రోజులు మరుపురానివిగా నిలిచిపోతాయని, అటువంటి ప్రత్యేక సందర్భాలను ఈ విధంగా కుటుంబ సభ్యులు, ఆత్మీయుల సమక్షంలో జరుపుకోవడం భవిష్యత్తులో మధుర జ్ఞాపకాలుగా మిగులుతాయని అన్నారు. పుట్టినరోజు వేడుకలను అర్థవంతంగా నిర్వహించిన తల్లిదండ్రులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, వనపర్తి మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బి. కృష్ణ, అల్వాల గ్రామ నాయకులు సుదర్శన్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, గట్టు యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలి



- వెల్టూర్ సర్పంచ్ అశోక్

**పెద్దమందడి,జనవరి11(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నిర్వహిస్తున్న వెల్టూర్ ప్రీమియం లీగ్ క్రికెట్ టోర్నమెంట్ను గ్రామ సర్పంచ్ అశోక్, మాజీ జెడ్పిటిసి రఘుపతి రెడ్డితో కలిసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అశోక్ మాట్లాడుతూ, క్రీడాకారులు గెలుపు-ఓటములను సమానంగా స్వీకరించాలని, అదే నిజమైన క్రీడాస్ఫూర్తి అని అన్నారు.క్రీడలు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని, యువతలో క్రమశిక్షణ, సహనం, జట్టు స్ఫూర్తి అలవడతాయని తెలిపారు. గ్రామీణ యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండేందుకు క్రీడలు ఉత్తమ మార్గమని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి క్రీడా కార్యక్రమాలు గ్రామంలో ఐక్యత, స్నేహభావాలను పెంచుతాయని అన్నారు.

ఈ సందర్భంగా గతంలో అస్తవ్యస్తంగా ఉన్న క్రీడా మైదానాన్ని గ్రామ నూతన సర్పంచ్ అశోక్ చొరవతో శుభ్రం చేయించడం జరిగింది. అలాగే టోర్నమెంట్‌లో పాల్గొంటున్న క్రీడాకారులకు టీ షర్ట్‌స్‌ను సర్పంచ్ అశోక్ స్వయంగా డొనేట్ చేశారు, దీనికి క్రీడాకారులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి రఘుపతి రెడ్డి మాట్లాడుతూ..గ్రామీణ స్థాయిలో క్రీడలను ప్రోత్సహించడం అభినందనీయమని, యువత క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొని వారికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

# సూరారం గ్రామంలో ఆటో యూనియన్ నూతన కమిటీ ఏర్పాటు



**ఎల్కతుర్తి, జనవరి 11:(తెలంగాణ ముచ్చట్లు) :** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలోని సూరారం గ్రామంలో ఆటో యూనియన్ నూతన కమిటీని ఆదివారం అధికారికంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా యూనియన్ సభ్యులు ఎల్కతుర్తి సర్కిల్ ఇన్స్పెక్టర్ పులి రమేష్, ఎల్కతుర్తి స్టేషన్ హౌస్ ఆఫీసర్ అక్కినేపల్లి ప్రవీణ్ కుమార్లను మర్యాదపూర్వకంగా కలిసి అభివాదం చేశారు. ఈ సమావేశంలో యూనియన్ కమిటీ బాధ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా హింగే భాస్కర్, అధ్యక్షుడిగా మౌటం చంద్రమౌళి, ఉపాధ్యక్షుడిగా బుగ్గ తిరుపతి, కార్యదర్శిగా వేముల రమేష్, సహ కార్యదర్శిగా గడ్డం రమేష్, ప్రచార కార్యదర్శిగా ఎండి ఇమ్రాన్ (చోటు)లను నియమించారు. అలాగే కమిటీ సభ్యులుగా చల్లూరి వేణు, భాస్కర్, సదానందం, సంపత్, రమేష్, ఎండి హజ్ ఇమ్రాన్, మల్లేశం, ప్రవీణ్, సదాశివుడు, సురేష్, వెంకటేష్, శంకర్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా కృషి చేస్తామని, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పోలీస్ శాఖకు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. అనంతరం సర్కిల్ ఇన్స్పెక్టర్ పులి రమేష్, స్టేషన్ హౌస్ ఆఫీసర్ అక్కినేపల్లి ప్రవీణ్ కుమార్ యూనియన్ సభ్యులను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

# జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వడ్డే ఓబన్న 219వ జయంతి వేడుకలు



**వనపర్తి,జనవరి11(తెలంగాణ ముచ్చట్లు):** జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వడ్డే ఓబన్న 219వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం నాయకులు పాల్గొని వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా వడ్డెర సంఘం నాయకులు మాట్లాడుతూ..వడ్డే ఓబన్న వడ్డెర సమాజానికి ఆదర్శప్రాయుడని, ఆయన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. సమాజ అభివృద్ధి, సామాజిక సమానత్వం కోసం ఆయన చేసిన పోరాటాన్ని ఈ తరం గుర్తుంచుకోవాలని అన్నారు.

వడ్డెర సంఘం నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇలాంటి కార్యక్రమాలు యువతలో సామాజిక చైతన్యాన్ని పెంపొందిస్తాయని నాయకులు తెలిపారు.

# వర్షిని కుటుంబాన్ని పరామర్శించిన ఐద్వా



- **బాధ్యులైన ఉపాధ్యాయులపై కఠిన చర్యలు తీసుకోవాలి**

**మల్కాజిగిరి, జనవరి 11 (తెలంగాణ ముచ్చట్లు):** అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కమిటీ సభ్యులు వర్షిని కుటుంబాన్ని పరామర్శించి, మృతికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా ఐద్వా మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. వినోద మాట్లాడుతూ--- ఈస్ట్ మారేడుపల్లి లోని డాక్టర్ మునగ రామ్ మోహన్ రావు గర్ల్స్ గవర్నమెంట్ జూనియర్ కాలేజీలో వర్షిని పరీక్షకు ఆలస్యంగా రావడంతో ఇంగ్లీష్ లెక్చరర్ ఆమెను తరగతి బయట నిలబెట్టిందన్నారు. పీరియడ్స్ కారణంగా ఆరోగ్యం బాగోలేదని వర్షిని చెప్పినప్పటికీ, పీరియడ్స్ విప్పి చూపించాలని అడగడం అత్యంత దారుణమని, ఇది అమ్మాయిని తీవ్ర మానసిక వేదనకు గురి చేసిందన్నారు.వర్షిని తండ్రి కార్పెంటర్ పని కొంతకాలం నిలిపివేయడంతో, ఆ విషయాన్ని కారణంగా చూపిస్తూ ఆ టీచర్ తరచూ వర్షినిని లక్ష్యంగా చేసుకుని వేధించిందని ఆరోపించారు. ఒక మహిళ, తల్లి స్థాయిలో ఉండాల్సిన ఉపాధ్యాయురాలు ఇలా ప్రవర్తించడం సమాజానికే సిగ్గుచేటని ఐద్వా నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు.పరీక్ష అనంతరం ఇంటికి వెళ్లిన వర్షిని తలనొప్పి ఉందని తల్లికి చెప్పడంతో ఆస్పత్రికి తీసుకెళ్లగా, ఎంఆర్ఐ స్కాన్ నిర్వహించి ఐసీయూలో చికిత్స అందించినా, తీవ్రమైన మానసిక ఒత్తిడితో మెదడులో రక్తం గడ్డకట్టడంతో (బ్రెయిన్ బ్లడ్ క్లాట్) ఆమె మృతి చెందినట్లు తెలిపారు.ఈ ఘటనతో తల్లిదండ్రులకు తీరని దుఃఖం మిగిలిందని పేర్కొన్న ఐద్వా నాయకులు---వర్షిని కుటుంబానికి ప్రభుత్వం రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, కుటుంబంలోని ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే వర్షిని మృతికి కారణమైన ఇంగ్లీష్ లెక్చరర్ మాధురి, ఫిజిక్స్ లెక్చరర్ శ్రీలక్ష్మిపై చట్టపరమైన చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరారు .ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు బి. మీనా కుమారి, మల్కాజిగిరి మండల ప్రధాన కార్యదర్శి పి. మంగ, ఐద్వా నాయకులు నసీమా, సిహెచ్. విజయలక్ష్మి, పి. అరుణ తదితరులు పాల్గొన్నారు.

# జయగిరిలో సంక్రాంతి సంబరాలు




**హసన్ పర్తి, జనవరి 11(తెలంగాణ ముచ్చట్లు):** హసన్ పర్తి మండలంలోని జయగిరిగ్రామంలో సర్పంచ్ వెంకటేశ్వర్లు,ఉప సర్పంచ్ భూక్య అరుణ్, గ్రామ పాలక మండలి ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు సోమవారం ఘనంగా నిర్వహించారు.సంక్రాంతి వేడుకలు సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు.ఈ పోటీలో సుమారు 30 మంది మహిళలు పాల్గొని ముగ్గులు వేశారు.ఈ కార్యక్రమానికి న్యాయ నిర్ణేతలుగా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ విజయలక్ష్మి,అధ్యాపకులు జయశీల పార్వతి,రమిత హాజరై మహిళలు వేసిన ముగ్గులను పరిశీలించి ప్రతిభ గల ముగ్గురిని ఎంపిక చేశారు. మొదటి బహుమతి బొజ్జ సంధ్యారాణి,రెండో బహుమతి పిట్టల సునీత,మూడో బహుమతి జనగాని సాత్విక ఎంపికయ్యారు. అనంతరం గెలుపొందిన మహిళలను గ్రామ ప్రజలు,గ్రామ పాలకమండలి సభ్యులు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామ పాలకమండలి సభ్యులు ,మహిళలు, తదితరులు పాల్గొన్నారు.





# సంక్రాంతి ముగ్గుల పోటీల్లో పాల్గొన్న నెమలి అనిల్ కుమార్

- **గెలుపొందిన మహిళలకు నగదు బహుమతుల ప్రదానం**



**మల్లాపూర్, జనవరి 11 (తెలంగాణ ముచ్చట్లు):** సంక్రాంతి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని మల్లాపూర్ డివిజన్ నాగ లక్ష్మి నగర్ కాలనీలో వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా ముగ్గుల పోటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ముగ్గుల పోటీల్లో గెలుపొందిన ఆడపడుచులకు నగదు బహుమతులు అందజేయడంతో పాటు, పోటీల్లో పాల్గొన్న ప్రతి మహిళకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. అనంతరం మహిళలకు, కాలనీ వాసులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయని నెమలి అనిల్ కుమార్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నాగలక్ష్మి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సలహాదారులు పి.జి. సుదర్శన్, హమాలీ శ్రీనివాస్, సిహెచ్. మల్లేష్, ఎం. రంగా రెడ్డి, ఎం. సాయి కృష్ణ పాల్గొన్నారు. అలాగే కాలనీ అధ్యక్షులు తోట నవీన్ గౌడ్, ఉపాధ్యక్షులు ఎం. మాధవ్ రెడ్డి, వి. శివకుమార్, ప్రధాన కార్యదర్శి సి. కిశోర్, సంయుక్త కార్యదర్శి డి. శ్రీనివాస్ రెడ్డి, ఏ. శ్రీధర్ బాబు, కోశాధికారి ఎస్. నరేందర్ రెడ్డి, కె. అరుణ్‌తో పాటు స్థానిక మహిళలు, కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కీసరలో ఘనంగా 205వ వారం జ్ఞానమాల కార్యక్రమం





- **అణగారిన వర్గాలకు సమానత్వం అందించిన మహనీయుడు అంబేద్కర్: శ్రద్ధ, స్ఫూర్తి కళాశాల ఎండి మధార్**

**కీసర, జనవరి 11 (తెలంగాణ ముచ్చట్లు):** సామాజిక విప్లవ మహోపాధ్యాయుడు, భారత రాజ్యాంగ నిర్మాత డా. బీ.ఆర్. అంబేద్కర్ లేకపోతే ఈ దేశం చీకట్లో మగ్గేదని కీసర శ్రద్ధ, స్ఫూర్తి కళాశాలల చైర్మన్ ఎండి. మధార్ పేర్కొన్నారు.కీసర మండల అంబేద్కర్ సంఘం అధ్యక్షులు కర్రె గణేష్, ప్రధాన కార్యదర్శి మంచాల సంజీవ్ ఆధ్వర్యంలో ఆదివారం 205వ వారం జ్ఞానమాల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎండి. మధార్ మాట్లాడుతూ, కోట్లాది మంది అణగారిన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపి, అక్షరాన్ని ఆయుధంగా మలిచిన మహనీయుడు డా. అంబేద్కర్ అని కొనియాడారు. కుల రక్కసి చీకట్లను చీల్చి భారత ప్రజలకు సమానత్వం, ప్రజాస్వామ్యాన్ని అందించిన యోధుడు అంబేద్కర్ అని మండల అంబేద్కర్ సంఘం అధ్యక్షులు కర్రె గణేష్ అన్నారు. అంబేద్కర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో జ్ఞానమాల కార్యక్రమాన్ని నిరంతరంగా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. సుమారు 580 మంది కళాశాల విద్యార్థులతో కలిసి కార్యక్రమానికి హాజరైన ఎండి. మధార్, అంబేద్కర్ సంఘం చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలను ప్రత్యేకంగా అభినందించారు. అంబేద్కర్ కృషివల్లే నేడు అణగారిన వర్గాలు ఆత్మగౌరవంతో జీవిస్తున్నాయని, నేటి యువత ఆయనను ఆదర్శంగాu తీసుకుని ఆయన అడుగుజాడల్లో నడవాలని సూచించారు.పెద్ద ఎత్తున విద్యార్థులు తరలిరావడంతో కీసర ప్రధాన చౌరస్తా పండుగ వాతావరణాన్ని తలపించింది. కార్యక్రమంలో భాగంగా ముఖ్య అతిథికి అంబేద్కర్ చిత్రపటాన్ని జ్ఞాపికగా అందజేశారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగకుండా మండల కమిటీ పోలీసుల సహకారంతో ముందస్తు ఏర్పాట్లు చేపట్టింది.ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం ఉపాధ్యక్షులు గోరంటి ప్రవీణ్, పులిపాక తిరుపతి, కోశాధికారి రొండ్ల మహేష్, సంయుక్త కార్యదర్శులు తాళ్ల కిరణ్, కుర్రి పరమేష్, మంచాల మహేష్, ఎంకిరాల నర్సింగ్ రావు, ముఖ్య సలహాదారులు రొండ్ల కృష్ణ, చినింగని ఆనంద్ రావు, మంగళపురి వెంకటేష్, రాగుల రమేష్ ముదిరాజ్‌తో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు, అధ్యాపక బృందం, నాయకులు మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.





# కందుకూరులో ఎమ్మెల్యే మట్టా రాగమయి పర్యటన

- **96వ పుట్టినరోజు సందర్భంగా బండి శ్రీనివాస్ రెడ్డికి శుభాకాంక్షలు.**

**సత్తుపల్లి, జనవరి 11 (తెలంగాణ ముచ్చట్లు):** సత్తుపల్లి నియోజకవర్గం వేంసూరు మండలం కందుకూరు గ్రామంలో ఆదివారం సత్తుపల్లి నియోజకవర్గ శాసనసభ్యురాలు మట్టా రాగమయి పర్యటించారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యులు బండి పార్థసారధి రెడ్డి తండ్రి, గ్రామ పెద్దలు బండి శ్రీనివాస్ రెడ్డి 96వ పుట్టినరోజు సందర్భంగా ఆయనను మర్యాదపూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కందుకూరు గ్రామంలోని డీసీసీబీ బ్యాంకును ఎమ్మెల్యే సందర్శించి సొసైటీ కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. బ్యాంకు ద్వారా రైతులకు అందుతున్న రుణాలు, సేవలపై ఆరా తీశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సేవలు మరింత సమర్థవంతంగా అందించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి, వేంసూరు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఏఎంసీ చైర్మన్లు, డైరెక్టర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# రాష్ట్రంలో నివాసయోగ్య నగరంగా ఖమ్మం...





రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు



**ఖమ్మం బ్యూరో, జనవరి- 11(తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రంలో నివాస యోగ్య నగరంగా ఖమ్మం ముందు వరుసలో ఉందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు.

మంత్రివర్యులు, ఆదివారం ఖమ్మం నగరం 54వ డివిజన్ లో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ పార్క్ ను రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, ఖమ్మం నగర మేయర్ పునుకొల్లు నీరజ, మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య లతో కలిసి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజల సౌకర్యార్థం ఏర్పాటుచేసిన పార్క్ ను మంచిగా నిర్వహణ చేస్తూ, ఇంకనూ కావాల్సిన సిసి కెమెరాలు, గ్రాస్ కార్పెట్ తదితరాలను సమకూర్చుకోని అభివృద్ధి పర్చుకోవాలన్నారు.

రోడ్లను ఆక్రమించుకోవద్దని, పేదలకు గృహ వసతి కల్పించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, రోడ్ల విస్తరణకు సహకరించాలని అన్నారు. నీటి ప్రవాహానికి అడ్డంకులు పెట్టడంతో సమస్యలు వస్తున్నాయని, అధికారుల ప్లాన్ ప్రకారం సహకరించాలని అన్నారు. ఇబ్బందులు తాత్కాలికంగా ఇబ్బందులు వచ్చిన విస్తరణతో అభివృద్ధి తో పాటు వ్యాపారాలు మంచిగా జరుగుతాయని అన్నారు. కొంతమందికి ఇబ్బంది కల్గిన, ఎంతో మందికి లబ్ది చేకూరుతుందని అన్నారు. నష్టపోయిన ప్రతి ఒక్కరినీ ప్రభుత్వం ఆదుకుంటుందని మంత్రి తెలిపారు. తెలంగాణ లో ఖమ్మం నగరం ఒక్కటే నివాసయోగ్య నగరంగా మారిందని, శాంతి భద్రతలు, పచ్చదనం, పరిశుభ్రత పాటిస్తే అంత అభివృద్ధి సాధ్యమని అన్నారు. జాతీయ రహదారులు ఖమ్మం మీదుగా వెళుతున్నాయని, రాబోయే కొద్దీ రోజుల్లో రాజమండ్రి కి గంటన్నర, హైదరాబాద్ కు రెండున్నర గంటల్లో వెళ్లొచ్చని అన్నారు. ప్రజలు రోడ్ల వెడల్పుకు సహకరిస్తే, ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందని, రోడ్ల వెడల్పుతో వ్యాపారం అభివృద్ధి తో పాటు, నగరం అందంగా ఉంటుందని మంత్రి అన్నారు. భవిష్యత్ తరాలకు ఆరోగ్యంగా వుండే నగరం అందించే బాధ్యత అందరిపై ఉందని, కాలుష్యం తగ్గించాలని, నగరాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని మంత్రి అన్నారు. ప్రజలకు ఉపయోగకరమైన పనులు నగరంలో చేపడుతున్నామని, ఈ పనులను స్థానిక నాయకులు, అధికారులు ప్రత్యేకంగా పర్యవేక్షించి నాణ్యతతో, త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని మంత్రి అన్నారు. ఖమ్మం నగర జనాభా 5 లక్షలకు చేరిందని, రోజురోజుకు పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా త్రాగునీటి సరఫరా, నూతన డ్రైయిన్ లు, రోడ్డు సౌకర్యం, పేదలకు ఇండ్లు వంటి అనేక కార్యక్రమాలను చేయాలని, దీనికి ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని మంత్రి తెలిపారు. ఖమ్మం మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ 54వ డివిజన్ నందు 93.70 లక్షల రూపాయలతో పార్క్ అభివృద్ధి చేశామని అన్నారు. అన్ని అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు, నగరంలో మౌళిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు అన్నారు. నగరాన్ని పచ్చదనం తో, పరిశుభ్రంగా ఉంచేలే సహకరించాలని తెలిపారు. నగరంలోని అన్ని డివిజన్లలో ఫుట్ పాత్, పార్కుల నిర్మాణం వంటి అనేక అభివృద్ధి పనులు జరుగుతున్నాయని అన్నారు. ఈ సందర్భంగా భోగి మంటలు, భోగి పండ్లతో ముందస్తు సంక్రాంతి పండుగ సంబరాలలో మంత్రి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ హనుమంత రావు, స్థానిక కార్పొరేటర్ మిక్కిలినేని మంజుల, కార్పొరేటర్లు, మునిసిపల్ ఇఇ కృష్ణలాల్, డిఇ ధరణి కుమార్,వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





# సత్తుపల్లిలో లయన్స్ హంగర్ సర్వీస్ ముగింపు

## సహకారానికి సన్మానం 792 రోజులకు చేరిన వీల్స్ ఆన్ మీల్స్.

**సత్తుపల్లి, జనవరి 11 (తెలంగాణ ముచ్చట్లు):** పేదల ఆకలి తీర్చడమే లక్ష్యంగా "సమాజం నుంచి ఎంతో పొందాం...సమాజానికి తిరిగి ఇవ్వాలి" అనే నినాదంతో సత్తుపల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన హంగర్ సర్వీస్ వారోత్సవం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షులు గోగడ రవి అధ్యక్షతన స్థానిక ప్రభుత్వాస్పత్రి వద్ద ముగింపు కార్యక్రమం నిర్వహించారు. వారం రోజుల పాటు చేపట్టిన హంగర్ సర్వీస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో సహకరించిన సత్తుపల్లి డివిజన్ ప్రైవేట్ పాఠశాలల సంఘం అధ్యక్షులు పసుపులేటి నాగేశ్వరరావుతో పాటు పట్టణానికి చెందిన రాంబాబు, మిద్దె శ్రీను, రహ్మద్ పాషా, వాహిద్, సన్నీలను లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సన్మానించారు.

వృద్ధులు, యాచకులు, పేదలకు ఉదయం వేళ అల్పాహారం అందించేందుకు చేపట్టిన వీల్స్ ఆన్ మీల్స్ కార్యక్రమం ఆదివారం నాటికి 792 రోజులకు చేరింది. స్థానిక ప్రభుత్వాస్పత్రి, బస్టాండ్ సెంటర్ ప్రాంతాల్లో గత 792 రోజులుగా ఎటువంటి అంతరాయం లేకుండా అల్పాహారం అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సేవలకు లయన్స్ క్లబ్ సభ్యులతో పాటు పట్టణంలోని దాతలు సహకరిస్తున్నారు.

ప్రజాసేవలో సత్తుపల్లి లయన్స్ క్లబ్ రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందిందని క్లబ్ నిర్వాహకులు తెలిపారు. ఉచిత అంబులెన్స్ సేవలు, నేత్రదానం, ఆరోగ్య శిబిరాలు తదితర సేవలు నిరంతరం కొనసాగుతాయని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మందపాటి ప్రభాకరరెడ్డి, దారా కృష్ణారావు, గండ్ర సోమిరెడ్డి, కొత్తూరు ప్రభాకర్ రావు, పెనుగొండ రమేష్, వెల్ది జగన్ మోహన్ రావు, రమణ, సలీం, గార్లపాటి సత్యనారాయణ, కేశవరావు, చల్లగుండ్ల అప్పారావు, మందపాటి చెన్నారెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.





# పార్టీలకతీతంగా పనిచేస్తే మున్ననూర్‌ను జిల్లాకే ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

## ఎమ్మెల్యే మేఘారెడ్డి

**గోపాల్పేట,జనవరి11(తెలంగాణ ముచ్చట్లు):** గ్రామాభివృద్ధికి పార్టీలకతీతంగా అందరూ కలిసి పనిచేస్తే మున్ననూర్ గ్రామాన్ని ఒకే ఒక్క సంవత్సరంలో జిల్లాకే ఆదర్శంగా తీర్చిదిద్దవచ్చని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. పల్లెబాట కార్యక్రమంలో భాగంగా ఆదివారం గోపాల్పేట మండలం మున్ననూర్ గ్రామంలో నిర్వహించిన ఉదయపు నడకలో ఆయన అన్ని శాఖల అధికారులతో కలిసి గ్రామంలో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు.గ్రామంలోని వీధుల గుండా పర్యటిస్తూ గ్రామస్తులతో నేరుగా మాట్లాడిన ఎమ్మెల్యే, పలు సమస్యలను అక్కడికక్కడే అధికారులతో చర్చించి తక్షణ పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. గ్రామంలో విద్యాభివృద్ధికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని సూచిస్తూ, పాఠశాల అభివృద్ధి కోసం ప్రభుత్వం తరఫున రూ. కోటి నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు.గ్రామపంచాయతీకి పక్క భవన నిర్మాణం, పల్లె దవాఖాన ఏర్పాటు, సీసీ రోడ్లు, మురికి కాలువలు, విద్యుత్ సమస్యల పరిష్కారం, తాగునీటి సౌకర్యాల కల్పన, మున్ననూర్ నుంచి ఏదుట్ల, కాశీంనగర్ గ్రామాలకు రోడ్ల నిర్మాణం, శివాలయంలో కళ్యాణ మండపం, ఆర్టీసీ బస్సు సర్వీసుల పునరుద్ధరణ, అర్హులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు, మహిళా సంఘ భవనం, ఇందిరా కాలనీలో ప్లాట్ల సమస్య పరిష్కారం, కుల సంఘాలకు సామూహిక భవనాల నిర్మాణం వంటి అభివృద్ధి పనులు చేపడతామని ఎమ్మెల్యే తెలిపారు.గ్రామ సర్పంచ్ నుంచి ఎంపీటీసీ, ఎంపీపీగా, ప్రస్తుతం ఎమ్మెల్యేగా గ్రామ సమస్యలన్నింటిపై అవగాహన ఉందని తెలిపారు. తన సొంత గ్రామం మంగంపల్లిలో పూర్తి అభివృద్ధి సాధించినట్టే మున్ననూర్ గ్రామాన్ని కూడా అన్ని రంగాలలో అభివృద్ధి సాధించేలా కృషి చేస్తానని అన్నారు. గత పాలకుల విషయాలు పక్కనపెట్టి, భవిష్యత్ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని అందరూ ముందుకు సాగాలని గ్రామస్తులకు సూచించారు.ప్రస్తుతం ఎన్నికైన సర్పంచులు, వార్డు సభ్యులు గ్రామానికి పెద్దలుగా బాధ్యతతో పనిచేసి గ్రామాన్ని సర్వతోముఖాభివృద్ధి దిశగా తీసుకెళ్లాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మున్ననూర్ గ్రామ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, గ్రామ సర్పంచ్ మమత, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు స్వరూప, గోపాల్పేట ఉమ్మడి మండల కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ సత్య శీలా రెడ్డి, మండల మత్స్య సహకార సంఘం అధ్యక్షులు సత్యం, గ్రామ అధ్యక్షుడు ధీరమల్లు, యూత్ అధ్యక్షుడు శశికుమార్, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఖిల్లా గణపురం లో ఘనంగా వడ్డే ఓబన్న 219వ జయంతి వేడుకలు



**ఖిల్లా గణపురం (తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా ఖిల్లా గణపురం మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో వడ్డే ఓబన్న 219వ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. మండల అధ్యక్షులు ఓర్సు యాదయ్య, మండల ప్రధాన కార్యదర్శి వల్లెపు ఆంజనేయులు ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షులు దాసర్ల భూమయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భూమయ్య తెలిపారు, వడ్డే ఓబన్న జనవరి 11, 1807న రేనాటి ప్రాంతంలో జన్మించి, సంచార జాతి వడ్డెర కులానికి చెందిన నాయకుడు. బ్రిటీష్ ఈస్ట్ ఇండియా కంపెనీ పాలనలో రేనాటి పాలెగాళ్లకు కుంఫనీ తవర్జీ విషయంలో ప్రారంభమైన ఘర్షణలు, క్రమేపీ సాయుధ పోరాటాలుగా మారినట్లు వివరించారు. నొస్సం పాలెగాడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సాయుధ పోరులో వడ్డే ఓబన్న సైన్యాధ్యక్షుడిగా పోషించిన వీరోచిత పాత్ర చరిత్రలో నిలిచిపోయిందని, సైన్యాన్ని సమర్ధవంతంగా నడిపి కుంఫనీ సైన్యాన్ని ఊచకోత కోసి ఊరేసిన తీరు గర్వప్రదంగా ఉందని ఆయన గుర్తుచేశారు.వడ్డెర్ జాతి మాత్రమే కాదు, సభ్య సమాజం మొత్తం గర్వించదగ్గ వీరత్వాన్ని వడ్డే ఓబన్న చాటినట్టు భూమయ్య వివరించారు .ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి నాయకులు సామ్య నాయక్, మాజీ సింగిల్ విండో వైస్ చైర్మన్ క్యామ రాజు, బిజెపి నాయకులు బుచ్చిబాబు గౌడ్, ఆశన్న వాడు, మెంబర్ లింగస్వామి, వడ్డెర సంఘం నాయకులు శ్రీరాములు, బీచుపల్లి ఆంజనేయులు, మల్లేష్ కురుమూర్తి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలకు సీసీ కెమెరా బహుకరణ చేసి రక్షణ కల్పించిన జంగం శివ




**పెద్దమందడి,జనవరి11(తెలంగాణ ముచ్చట్లు):** దాతల సహకారంతో పెద్దమందడి ప్రైమరీ పాఠశాలకు వేసిన పెయింటింగ్లను రక్షించడానికి, అలాగే పాఠశాల ఆవరణలో తాగడం, గుట్కాలు తినడం వంటి క్రమ రక్షణకు రూ.6,500/ రూపాయల విలువ గల సీసీ కెమెరాను పాఠశాలకు బహుకరించిన జంగం శివ కు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ సీసీ కెమెరా ద్వారా పాఠశాల ఆవరణలో సురక్షిత వాతావరణాన్ని కల్పించడం సాధ్యమవుతుందని, విద్యార్థులు, ఉపాధ్యాయులు మరింత క్రమశిక్షణతో పాఠశాలలో వేదనలేని, సురక్షితమైన విద్యా వాతావరణంలో చదువుకోగలుగుతారని ప్రత్యేకంగా అభినందించారు.

# ఎమ్పీజే నూతన క్యాలెండర్ ను ఆవిష్కరించిన మంత్రి తుమ్మల నాగేశ్వర రావు



**ఖమ్మం బ్యూరో, జనవరి 11(తెలంగాణ ముచ్చట్లు):** మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ (ఎంపీజే) సంస్థ రూపొందించిన 2026 నూతన సంవత్సర క్యాలెండర్ ను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ఖమ్మం లోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ, సమాజంలో శాంతి, న్యాయం, సామరస్యాన్ని పెంపొందించడంలో మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ (ఎంపీజే) సంస్థ చేస్తున్న సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. ప్రజల్లో మానవ విలువలు, సామాజిక బాధ్యతను పెంపొందించే కార్యక్రమాలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో ఎంపీజే రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ ఖాసిం, జిల్లా కోశాధికారి ఎండి హకీమ్, సెక్రటరీ ఎండి రజబ్ అలీ, మాజీ సిటీ లైబ్రరీ చైర్మన్ ఎండి అశ్రిఫ్, బిఆర్ అంబేద్కర్ యువజన సంఘం జాతీయ అధ్యక్షులు లింగాల రవికుమార్, కాంగ్రెస్ లీడర్ ఎండి సాద్, ఎంపీజే జిల్లా సభ్యులు ఎస్.కె హుస్సేన్ మియా, సయ్యద్ ఇస్మాయిల్, ఎస్ కే జానీ, ఎస్ డి రఫీక్, తదితరులు పాల్గొన్నారు





# కాజీపేట్ లో అట్టహాసంగా 58వ జాతీయ స్థాయి సీనియర్ ఖోఖో పోటీలు ప్రారంభం

- ముఖ్య అతిధులు గా హాజరైన రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి,
- వాకటి శ్రీహరి .
- వివిధ రాష్టాల నుండి వచ్చిన క్రీడాకారులు

**కాజీపేట్ జనవరి 11 (తెలంగాణ ముచ్చట్లు):** కాజీపేట్ పట్టణంలోని రైల్వే స్టేడియం లో ఆదివారం సాయంత్రం 58వ జాతీయ స్థాయి సీనియర్ ఖోఖో పోటీలు అట్టహాసం గా ప్రారంభమయ్యాయి.

జాతీయ స్థాయి సీనియర్ ఖోఖో పోటీలను రాష్ట్ర మంత్రి లు ఉత్తమ్ కుమార్ రెడ్డి , వాకిటి శ్రీహరి, తెలంగాణ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ స్టేట్ చైర్మన్,తెలంగాణ ఖోఖో అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీ జంగా రాఘవ రెడ్డి కలసి ప్రారంభించారు.

ముందుగా వారు క్రీడాపతాకాన్ని ఆవిష్కరించారు.అనంతరం వివిధ రాష్ట్రాల జట్ల క్రీడాకారులతో కలసి మార్చ్‌పాస్ట్ నిర్వహించి మంత్రులకు గౌరవవందనం సమర్పించారు.

ఈ సందర్భంగా ముఖ్య అతిధిగా విచ్చేసిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ యువత,విద్యార్థులు చదువు తో పాటు క్రీడల పై ద్రుష్టి పెట్టాలని,ఖోఖో పోటీలు ఖాజీపేట లో ప్రారంభం కావడం మంచి పరిణామం అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం క్రీడాలకు అత్యదిక ప్రాధాన్యతనిస్తుందని మంత్రులు తెలిపారు.

తెలంగాణ ఖోఖో అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీ జంగా రాఘవ రెడ్డి గారు మాట్లాడుతూ వరంగల్,కాజీపేట ప్రాంతం క్రీడలకు పుట్టినిల్లు అని ఎంతో మంది జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులు తయారు చేసిన ఘనత వరంగల్ కు దక్కుతుందని అన్నారు.

అంత్యంత ప్రతిష్టత్మకంగా ఈ క్రీడాలను నిర్వహణ భాద్యతలను గౌరవ తెలంగాణ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ స్టేట్ చైర్మన్,తెలంగాణ ఖోఖో అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీ జంగా రాఘవ రెడ్డి గారు ముందుండి నిర్వహించడం మంత్రులు క్రీడాభిమానులు జంగా రాఘవ రెడ్డికి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులతో పాటు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాదవ రెడ్డి ,భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారణ,ఎమ్మెల్సీ బస్వారాజు సారయ్య, స్పోర్ట్స్ చైర్మన్ శివసేనా రెడ్డి , దేశ నలుమూలల నుండి వచ్చిన క్రీడాకారులు లతోపాటు తదితరులు పాల్గొన్నారు.





# సంక్రాంతి సందర్భంగా ముగ్గుల పోటీలు





- తెలుగు సంప్రదాయాల ప్రతిబింబంగా జమ్మిగడ్డలో రంగవల్లుల ముగ్గులు

**ఏ.ఎస్.రావు నగర్, జనవరి 11 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం డా, ఏ.ఎస్.రావు నగర్ డివిజన్ పరిధిలోని జమ్మిగడ్డ ప్రాంతం లో మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావని మణిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీలు ఘనంగా సాగాయి. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర సంక్షేమ రైతు కమిషన్ సభ్యురాలు మరికంటి భవాని రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ముగ్గుల పోటీలతో జమ్మిగడ్డ ప్రాంతం రంగుల మయంగా మారింది. పరిసర కాలనీలకు చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనగా, మొత్తం 156 మంది తమ ప్రతిభను ప్రదర్శించారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా వేసిన రంగవల్లుల ముగ్గులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సామాజిక అంశాలతో కూడిన ముగ్గులు ఎక్కువగా ఉండటంతో విజేతల ఎంపిక కమిటీకి కష్టతరంగా మారిందని నిర్వాహకులు తెలిపారు.పోటీల్లో సింగం నిహారిక ప్రధమ బహుమతి, ప్రియాంక ద్వితీయ బహుమతి, లిఖిత తృతీయ బహుమతి సాధించారు. విజేతలకు ముఖ్య అతిథి మరికంటి భవాని రెడ్డి, పావని మణిపాల్ రెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా మరికంటి భవాని రెడ్డి మాట్లాడుతూ, సంక్రాంతి తెలుగు ప్రజలకు అత్యంత ప్రాముఖ్యమైన పండుగ అని పేర్కొన్నారు. ధనుర్మాసంలో ప్రజలు ఆనందోత్సాహాలతో పండుగను జరుపుకుంటారని, మహిళలు పిండి వంటలు చేస్తూ, పురుషులు మరియు పిల్లలు పతంగులు ఎగురవేస్తూ సంబరాలు చేసుకుంటారని తెలిపారు.పావని మణిపాల్ రెడ్డి మాట్లాడుతూ, తెలుగు సంస్కృతి సంప్రదాయాలను కాపాడడంతో పాటు మహిళల్లో పోటీ తత్వాన్ని పెంపొందించాలనే లక్ష్యంతో ఈ ముగ్గుల పోటీలను నిర్వహించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు, స్థానిక ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

# షైన్ హై స్కూల్ సంక్రాంతి సంబరాలు...





**ఖమ్మం బ్యూరో, జనవరి 11(తెలంగాణ ముచ్చట్లు):** స్థానిక షైన్ హై స్కూల్ లో శనివారం సంక్రాంతి సంబరాలు చాలా ఘనంగా జరిగాయి...విద్యార్థుల హరిదాసు, గోదాదేవి, రైతు,వేశాదారణాలతో పాటు సాంప్రదాయ దుస్తులతో అందరిని అలరించారు... చిన్నారులకు భోగి పండ్లు పోసి ఆశీర్వదించారు. భోగిమంటల తో పాటు, సంక్రాంతి పండుగను సూచించేలా వరి నాట్లు వేయడం, వరి కోత,వరి పంట నూర్పడం,వడ్లు దంచడం వంటి పనులను చిన్నారులు కళ్ళకు కట్టినట్లు చూపించారు. తదుపరి విద్యార్థులకు ముగ్గుల పోటీ నిర్వహించారు. ఈ కార్యక్రమం లో కరెస్పాండంట్ అన్సర్ పాషా, డైరెక్టర్ లాల్ మహమ్మద్, ప్రిన్సిపాల్ శ్వేత, అడ్మినిస్ట్రేషన్ నాగేశ్వరావు, ఉపాధ్యాయ బృందం విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు...

# మృతుని కుటుంబానికి మేఘున్న ఆర్థిక చేయూత



**పెద్దమందడి,జనవరి11(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం పామిరెడ్డి పల్లి గ్రామానికి చెందిన వడ్డె తిక్కన అనారోగ్యంతో మృతి చెందడం జరిగింది. స్థానిక కాంగ్రెస్ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి మృతుని కుటుంబానికి అంత్యక్రియల నిర్వహణకు సహాయంగా రూ.5,000/ రూపాయల నగదు సాయాన్ని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తరఫున కాంగ్రెస్ నాయకులు కుటుంబ సభ్యులకు అందజేశారు. కష్ట సమయంలో అందిన ఆర్థిక సహాయానికి మృతుని కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మదిర శ్రీశైలం, కొంకాలి నరేష్, చినయ్య, రాజశేఖర్ రెడ్డి (మానేంకొండ), శంకర్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది



- డా. జిల్లెల చిన్నారెడ్డి

**వనపర్తి,జనవరి11(తెలంగాణ ముచ్చట్లు):** పేద ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పటికీ కట్టుబడి ఉంటుందని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి స్పష్టం చేశారు. ప్రైవేట్ కార్పొరేట్ ఆసుపత్రుల్లో అత్యవసర వైద్య సేవలు పొందిన పేదలను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన సీఎం సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) కింద 86 చెక్కులను, మొత్తం రూ.21,45,000 విలువైన నిధులను ఆయన లబ్ధిదారులకు అందజేశారు.ఈ సందర్భంగా డా. జిల్లెల చిన్నారెడ్డి మాట్లాడుతూ, గత ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసిందని, అయితే రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క క్రమశిక్షణతో ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టి పేద ప్రజలకు అవసరమైన సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రికార్డు స్థాయిలో సీఎం రిలీఫ్ ఫండ్ అందిస్తున్నామని పేర్కొన్నారు.పేదలకు ఆరోగ్య శ్రీ పథకం ద్వారా ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందిస్తున్నామని, ఆరోగ్యశ్రీ వర్తించని వారికి చికిత్స అనంతరం సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక ఉపశమనం కల్పిస్తున్నామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిజంగా పేద ప్రజలను గుర్తించి వారి సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తోందని ఆయన స్పష్టం చేశారు.సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డా. జిల్లెల చిన్నారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్, వనపర్తి జిల్లా ఏఐపీసీ అధ్యక్షులు నాగార్జున, జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ చంద్రశేఖర్, వనపర్తి పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ కదిరే రాములు యాదవ్, పట్టణ ప్రధాన కార్యదర్శి అడ్వకేట్ బాబా, పెద్దమందడి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సి. పెంటన్న యాదవ్, అసెంబ్లీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గడ్డం వినోద్, వనపర్తి మండల ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు ఎత్తం చరణ్ రాజ్, యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ ఇర్ఫాన్, పెద్దమందడి ఎన్ఎస్‌యూఐ నాయకులు వెంకటేష్ సాగర్, పెద్దగూడెం మాజీ సర్పంచ్ జానకమ్మ, మెంటేపల్లి సర్పంచ్ రాములు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కోళ్ల వెంకటేష్, సహదేవుడు, అబ్దుల్లా, జానంపేట నాగరాజ్, రాంబాబు, ఎంట్ల రవి, కృపాకర్ రెడ్డి, శ్రీనివాసులు, రమేష్, శ్రీధర్ రెడ్డి, గోవర్ధన్, బాలరాజ్, చెన్నయ్య, పెద్దమందడి సోషల్ మీడియా కోఆర్డినేటర్ గట్టు రాజు తదితరులు పాల్గొన్నారు.



# లాల్ బహదూర్ శాస్త్రి వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించిన ఎమ్మెల్యే

**వనపర్తి,జనవరి11(తెలంగాణ ముచ్చట్లు):** జై జవాన్-జై కిసాన్ నినాదకర్త, స్వాతంత్ర సమరయోధుడు లాల్ బహదూర్ శాస్త్రి వర్ధంతి సందర్భంగా వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వనపర్తి పట్టణంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ.. నిరాడంబరతకు ప్రతీక అయిన లాల్ బహదూర్ శాస్త్రి స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకుగా పాల్గొని సహాయ నిరాకరణోద్యమం, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో భాగస్వామ్యమై ఎన్నోసార్లు జైలు శిక్ష అనుభవించారని గుర్తు చేశారు. తెల్ల విప్లవానికి శ్రీకారం చుట్టి, హరిత విప్లవానికి బాటలు వేసిన మహానేతగా శాస్త్రి దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని అన్నారు.ఇండో-పాకిస్తాన్ యుద్ధ సమయంలో జై జవాన్-జై కిసాన్ అనే నినాదంతో సైనికుల్లో ధైర్యాన్ని, రైతుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపిన నాయకుడిగా లాల్ బహదూర్ శాస్త్రి మనందరికీ ఆదర్శమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, జిల్లా దిశా కమిటీ సభ్యురాలు ధనలక్ష్మి, తిరుపతయ్య గౌడ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బి. కృష్ణ, పట్టణ మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## వేలేరులో వడ్డే ఓబన్న జయంతి వేడుకలు

- ముఖ్యఅతిథిగా హాజరైన సర్పంచ్ బిల్లా యాదగిరి

**వేలేరు,జనవరి11(తెలంగాణ ముచ్చట్లు):**

వేలేరు మండల కేంద్రంలో వడ్డెర సంఘం ఆధ్వర్యంలో వడ్డెర కులానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వడ్డెర కులం వేలేరు కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కుల సభ్యులు పాల్గొన్నారు.ముఖ్య అతిథిగా సర్పంచ్ బిల్లా యాదగిరి హాజరై మాట్లాడారు. స్వాతంత్ర్య పోరాటానికి ముందే దక్షిణ భారతదేశంలో బ్రిటిష్ పాలకుల దౌర్జన్యాలకు ఎదురొడ్డి పోరాడిన వీరుడిగా వడ్డే ఓబన్న చరిత్రలో నిలిచారని ఆయన పేర్కొన్నారు. సామాజిక స్పృహతో పాటు ధైర్యసాహసాలకు ప్రతీకగా నిలిచిన ఓబన్న జీవితం నేటి తరాలకు ఆదర్శమని అన్నారు. అలాగే వేలేరు వడ్డెర సంఘానికి సంబంధించిన సమస్యలను త్వరలోనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ సందర్భంగా సర్పంచ్ బిల్లా యాదగిరి, ఉపసర్పంచ్ శ్రీకర్లను వడ్డెర కుల సంఘం కమిటీ సన్మానించింది. కార్యక్రమంలో వడ్డెర కుల అధ్యక్షుడు రాజు, ఉపాధ్యక్షుడు రాజు, సంఘ నాయకులు సాంబయ్య, రాజయ్య, మల్లయ్య, సరయ్య, యువ నాయకులు విజయ్, కుమార్, రమేష్, శ్రీకాంత్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## నాటెల్లి దాడి ఘటనపై ఎస్సీ–ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

- నిందితులను వెంటనే అరెస్టు చేయాలని ఎమ్మార్పీఎస్ డిమాండ్

**కొత్తకోట,జనవరి11(తెలంగాణ ముచ్చట్లు):**



కొత్తకోట మండలం నాటెల్లి గ్రామంలో జరిగిన దాడి ఘటనపై బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎమ్మార్పీఎస్ జిల్లా కమిటీ బాధిత కుటుంబాన్ని పరామర్శించింది. ఈ సందర్భంగా సంఘటనపై నిజ నిర్ధారణ చేపట్టినట్లు ఎమ్మార్పీఎస్ నాయకులు తెలిపారు.వివరాల్లోకి వెళితే, గ్రామంలో జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఓడిపోయిన సర్పంచ్ అభ్యర్థి నెహ్రూ వర్గానికి చెందిన అశోక్ తదితరులు ముందస్తు ప్రణాళికతో బాధితుల ఇంటిపై దాడి చేసినట్లు బాధితులు తెలిపారు. ఇను పరాళ్లతో గేటు తన్నుకుంటూ ఇంటిలోకి ప్రవేశించి తలుపులు పగలగొట్టి, కర్రలతో కుటుంబ సమేతంగా విచక్షణ రహితంగా దాడి చేశారని ఆరోపించారు. ఈ దాడిలో కారు అద్దాలు ధ్వంసం చేయడంతో పాటు, కులం పేరుతో దూషించి అవమానించారని, గర్భిణీ మహిళపై, పసి పిల్లలపై కూడా దాడి చేసినట్లు బాధితులు వాపోయారు. అయితే ఈ ఘటనలో స్థానిక ఎస్సై, సీఐలు నిందితులకు సహకరిస్తూ కేసును తప్పుదోవ పట్టించారని, అసలు బాధితులపైనే కేసులు నమోదు చేశారని ఎమ్మార్పీఎస్ నాయకులు ఆరోపించారు. వాస్తవాలను తెలిసినా పోలీసులు నిందితులను అరెస్టు చేయకుండా వెనకేసుకొస్తున్నారని మండిపడ్డారు.ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి టైగర్ జంగయ్య మాదిగ మాట్లాడుతూ, అసలైన దోషులను గుర్తించి వారి మీద ఎస్సీ-ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లావ్యాప్తంగా ప్రజా సంఘాలను కలుపుకొని బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. అలాగే బాధిత కుటుంబానికి వెంటనే రక్షణ కల్పించాలని, ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు.ఈ కార్యక్రమంలో గంధం గట్టయ్య మాదిగ (ఎమ్మార్పీఎస్ సమన్వయకర్త), కొమ్ము చెన్నకేశవులు మాదిగ (వనపర్తి జిల్లా అధ్యక్షులు), మొలకలపల్లి పరుషరాముడు మాదిగ (ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు), మాలపల్లి మన్యం మాదిగ (మాజీ ఎంపీటీసీ), వర్మ మాదిగ (ఎమ్మార్పీఎస్ సోషల్ మీడియా నాయకులు), బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, దళిత నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సోమనాథ్ స్వాభిమాన పర్వ్ శౌర్య యాత్రలో పాల్గొన్న ప్రధాని నరేంద్ర మోదీ



- శౌర్య యాత్రలో పాల్గొని గర్వం వ్యక్తం
- ఆలయ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన వీరులకు నివాళి
- దేశవాసులకు స్ఫూర్తినిచ్చే త్యాగగాథలు



సోమనాథ్ స్వాభిమాన పర్వ్ సందర్భంగా నిర్వహించిన శౌర్య యాత్రలో పాల్గొనడం తనకు అత్యంత గర్వకారణమని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఈ యాత్ర దేశ ఆత్మగౌరవానికి, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలుస్తుందని ఆయన వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా గుజరాత్‌లోని ప్రసిద్ధ సోమనాథ్ దేవాలయం రక్షణ కోసం తమ ప్రాణాలను అర్పించిన మాతృభూమి వీర సంతానాలకు ప్రధాని ఘనంగా నివాళులు అర్పించారు. ఆలయ పరిరక్షణ కోసం జరిగిన త్యాగాలు భారత చరిత్రలో చిరస్మరణీయమని ఆయన అన్నారు.
వీరుల అదమ్య సాహసం, పరాక్రమం దేశ ప్రజలందరికీ ఎల్లప్పుడూ ప్రేరణగా నిలుస్తుందని మోదీ స్పష్టం చేశారు. స్వాభిమాన పర్వ్ ద్వారా దేశంలో జాతీయ గర్వం, ఐక్యత మరింత బలపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. భారతదేశ ఆధ్యాత్మిక-సాంస్కృతిక విలువలను కాపాడేందుకు జరిగిన ఈ త్యాగాలు రాబోయే తరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని ప్రధాని తెలిపారు. సోమనాథ్ శౌర్య యాత్ర దేశభక్తి భావాన్ని మరింత ప్రగాఢం చేస్తోందని ఆయన పేర్కొన్నారు.

## సోమనాథ్ ఆలయ పునర్నిర్మాణానికి సర్దార్ పటేల్ సంకల్పమే కారణం: ప్రధాని మోదీ

- 1947 దీపావళి పర్యటనలో పటేల్ తీసుకున్న నిర్ణయం
- 1951లో భక్తులకు తెరచుకున్న ఆలయ ద్వారాలు
- జాతీయ సంకల్పానికి ప్రతీకగా సోమనాథ్



ఈ రోజు మనం దర్శిస్తున్న సోమనాథ్ ఆలయం వాస్తవ రూపం దాల్చడానికి మహానేత సర్దార్ వల్లభభాయి పటేల్ అచంచల సంకల్పమే ప్రధాన కారణమని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. 1947లో దీపావళి సమయంలో సోమనాథ్‌ను సందర్శించిన సర్దార్ పటేల్ ఆలయ స్థితిని చూసి చలించిపోయి, అక్కడ భవ్యమైన ఆలయాన్ని పునర్నిర్మించాలనే ప్రతిజ్ఞ చేశారని మోదీ గుర్తు చేశారు.
ఆ ప్రతిజ్ఞే స్వాతంత్ర్యానంతర భారతదేశంలో సాంస్కృతిక పునరుజ్జీవనానికి బీజంగా మారిందని ప్రధాని పేర్కొన్నారు. 1951 మే నెలలో సోమనాథ్ ఆలయం భక్తులకు తెరచుకున్నప్పటికీ, ఆ ఘట్టాన్ని సర్దార్ పటేల్ ప్రత్యక్షంగా చూడలేకపోయారని మోదీ తెలిపారు. అయినప్పటికీ, ఆయన సంకల్పబలం, దూరదృష్టి ఈ ఆలయ సముదాయంలోని ప్రతి భాగంలో ప్రతిబింబిస్తోందని వ్యాఖ్యానించారు.
సోమనాథ్ ఆలయం కేవలం ఆధ్యాత్మిక క్షేత్రమే కాకుండా, దేశ ఆత్మగౌరవం, జాతీయ సంకల్పానికి ప్రతీకగా నిలుస్తోందని ప్రధాని మోదీ అన్నారు. సర్దార్ పటేల్ చూపిన మార్గం నేటి తరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని, భారతదేశ సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకోవడంలో ఆయన పాత్ర చిరస్మరణీయమని స్పష్టం చేశారు.

## జూనియర్ జాతీయ ఫెన్సింగ్ పోటీల్లో కేంద్ర భద్రతా దళానికి స్వర్ణ విజయం

- కటక్‌లో జరిగిన పోటీల్లో అద్భుత ప్రదర్శన
- సేబర్ విభాగంలో జట్టు ఈవెంట్‌కు స్వర్ణ పతకం
- ఆసియా జూనియర్ పోటీలకు ఎంపిక

ఒడిశా రాష్ట్రం కటక్‌లో నిర్వహించిన ముప్పై మూడవ జూనియర్ జాతీయ ఫెన్సింగ్ పోటీల్లో కేంద్ర భద్రతా దళానికి చెందిన ఫెన్సింగ్ బృందం ఘన విజయాన్ని సాధించింది. ఈ పోటీల్లో లాన్స్ నాయకురాలు హిమాన్షి నేగి జట్టు ఈవెంట్‌లో పాల్గొని స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నారు.
సేబర్ విభాగంలో పోటీపడిన హిమాన్షి నేగి అసాధారణ నైపుణ్యం, చక్కటి జట్టు సమన్వయంతో ప్రత్యర్థులపై ఆధిపత్యం చెలాయించారు. కీలక దశల్లో ఆమె చూపిన ధైర్యసాహసం, సాంకేతిక ప్రతిభ జట్టును అగ్రస్థానానికి చేర్చడంలో కీలకంగా నిలిచింది.
ఈ అద్భుత విజయంతో హిమాన్షి నేగికి మరో గొప్ప అవకాశం లభించింది. ఆసియా స్థాయి జూనియర్ ఫెన్సింగ్ పోటీలకు భారత జట్టులో ఆమె ఎంపిక య్యారు. దేశాన్ని అంతర్జాతీయ వేదికపై ప్రాతినిధ్యం వహించనున్న ఆమెకు కేంద్ర భద్రతా దళం శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించింది.








## కేరళలో భాజపా ప్రభుత్వ ఏర్పాటే అంతిమ లక్ష్యం

కేరళలో భారతీయ జనతా పార్టీ(భాజపా) ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడమే తమ అంతిమ లక్ష్యమని కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. నూతనంగా ఎన్నికైన భాజపా స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులతో ఆదివారం ఏర్పాటుచేసిన సభలో ఆయన ఈ మేరకు మాట్లాడారు. వచ్చే రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల కోసం చేపట్టిన 'మిషన్ 2026' కార్యక్రమాన్ని అమిత్ షా ప్రారంభించారు. ''కేరళలో భాజపా ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసి, అభివృద్ధి చెందిన రాష్ట్రంగా చేయడమే మన లక్ష్యం. దేశ వ్యతిరేక శక్తుల నుంచి కేరళను రక్షించడంతో పాటు శతాబ్దాలుగా రాష్ట్రంలో ఉన్న నమ్మకాల్ని కాపాడేందుకు కృషిచేయాలి. ఈ మూడింటిని యూడీఎఫ్, ఎల్‌డీఎఫ్‌లు పూర్తి చేయలేవని, నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయేతోనే ఇది సాధ్యం'' అని అమిత్ షా పేర్కొన్నారు. శబరిమల బంగారం తాపడాల కేసు విషయంలో ముఖ్యమంత్రి పినరయి విజయన్‌పై అమిత్ షా తీవ్రంగా విరుచుకుపడ్డారు. ఈ కేసు విచారణను తటస్థ దర్యాప్తు సంస్థ చేపట్టేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. శబరిమల ఆలయంలోని ఆస్తులను కాపాడడంలో విఫలమైన వారు ప్రజల నమ్మకాన్ని ఎలా కాపాడతారని ప్రశ్నించారు. ''శబరిమల బంగారం చోరీ సమస్య కేవలం కేరళ ప్రజలది మాత్రమే కాదు. దేశవ్యాప్తంగా ఉన్న భక్తులందరిది. ఈ కేసులో నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్‌ను గమనిస్తే.. నిందితులను రక్షించేందుకే రూపొందించినట్లుగా ఉంది. దీనిపై రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టడమే కాదు. ఇంటింటికీ ప్రచార కార్యక్రమాలు చేపడతాం'' అని అమిత్ షా మండిపడ్డారు. రాష్ట్రంలోని శాంతి భద్రతలు ప్రస్తుతం ప్రశాంతంగా కనిపించొచ్చు కానీ, భవిష్యత్తులో ప్రమాదకరంగా మారే పలు సంఘటనలు బయటపడుతున్నాయని ఆయన హెచ్చరించారు.

## భవిష్యత్తుకు సిద్ధమైన సైనిక-సాంకేతిక నిపుణుల తయారీపై దృష్టి

- సుదర్శన్ చక్ర కార్ప్స్‌ను సందర్శించిన లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ కుమార్ సహ్నీ
- డ్రోన్ తయారీ–శిక్షణ కేంద్రంలో స్వదేశీ ప్రయత్నాలకు ప్రశంస
- అగ్నివీర్ల నైపుణ్యాలు, ఉత్సాహంపై అభినందనలు






భారత సైన్యాన్ని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దే క్రమంలో కీలక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో డైరెక్టర్ జనరల్ ఎలక్ట్రో-మెకానికల్ ఇంజినీరింగ్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ కుమార్ సహ్నీ సుదర్శన్ చక్ర కార్ప్స్‌తో పాటు భోపాల్‌లోని మూడవ ఈఎంఈ కేంద్రాన్ని సందర్శించారు. సుదర్శన్ చక్ర డ్రోన్ తయారీ, శిక్షణ కేంద్రంలో కొనసాగుతున్న కార్యకలాపాలను ఆయన పరిశీలించారు. తక్కువ ఖర్చుతో, యుద్ధ రంగంలో ఎక్కువ ప్రయోజనం కలిగించే డ్రోన్లను స్వదేశీంగా తయారు చేసే దిశగా సాగుతున్న ప్రయత్నాలను ప్రశంసించారు. తయారీ, శిక్షణ, మౌలిక సదుపాయాల అభివృద్ధిపై తీసుకుంటున్న స్పష్టమైన చర్యలు స్వావలంబన లక్ష్యాన్ని బలపరుస్తున్నాయని పేర్కొన్నారు.
అనంతరం మూడవ ఈఎంఈ కేంద్రాన్ని సందర్శించిన ఆయన, ఆధునిక శిక్షణా విధానాలు, తయారీ మౌలిక వసతులను సమీక్షించారు. అక్కడ శిక్షణ పొందుతున్న అగ్నివీర్లతో ముచ్చటించి, వారి ఉన్నత మనోధైర్యం, సాంకేతిక నైపుణ్యం, సేవాభావాన్ని అభినందించారు. బహుముఖ ఆపరేషన్లకు సిద్ధమైన సైనిక-సాంకేతిక నిపుణులుగా వారు ఎదుగుతున్నారని పేర్కొంటూ, భవిష్యత్తులో దేశ రక్షణలో కీలక పాత్ర పోషిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు.



Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in